ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
బుధవారం 4 జూన్ 2025



కడలి తీరం.. యోగా వికాసం

సూర్యోదయాన.. ఉవ్వెత్తున ఎగసిపడే సాగర కెరటాల తీరాన సామూహిక యోగ సాధన ఆకట్టుకుంది. ఇందుకూరుపేట మండలం మైపాడు తీరంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, ఆర్డీవో పావని తదితర ప్రముఖులతోపాటు ప్రజలు తరలివచ్చి యోగాసనాలు వేశారు.

8

యోగా లక్ష్యాన్ని పూర్తి చేయండి

● టెలికాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 10 లక్షల మందిని యోగా కోసం రిజిస్ట్రేషన్లు చేయించాలనేది లక్ష్యమని, ఈ లక్ష్యాన్ని వెంటనే పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో యోగాపై పలు సూచనలు చేశారు. గ్రామ స్థాయిలో యోగాకు సంబంధించి గ్రామస్థులతో మ్యాపింగ్ చేయాలన్నారు. ఎంపిక చేసిన ట్రైనర్ల ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మండల స్థాయి యోగా పోటీలను ఈవారం చివరిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

కాకాణి కస్టడీ పిటిషన్


రేపటికి వాయిదా



నెల్లూరు (లీగల్), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కస్టడీ పిటిషన్‌పై తీర్పును గురువారానికి వాయిదా వేస్తూ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి సుమా ఉత్తర్వు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పేలుడు పదార్థాల నిరోధక చట్టం, అక్రమ మైనింగ్ జరిపారన్న అభియోగాలతో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న కాకాణిని ఏడు రోజులపాటు విచారణ నిమిత్తం తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై మంగళవారం వాదప్రతివాదనలు విన్న న్యాయాధికారి ఈ పిటిషన్‌పై తీర్పును 5వ తేదీకి వాయిదా వేశారు. అలాగే బెయిల్ పిటిషన్‌పై విచారణను కూడా 5వ తేదీకే వాయిదా వేస్తూ ఉత్తర్వు చేశారు.

మీరు లేకున్నా.. మీ పాటలు పదిలం

నేడు ఎస్పీ బాలు జయంతి



ఎన్నో భాషల్లో వేల పాటలు పాడి ప్రపంచం గర్తించదగ్గ గాయకుడిగా రసహృదయాల్లో నిలిచిపోయారు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. సంగీత దర్శకుడిగా మంచి సంగీతం వినిపించాలని తపించిన స్వరపుత్రుడు ఆయన. గాత్రధారిగానే కాక చలన చిత్రాల్లో పాత్రధారిగా, బుల్లితెర సంగీత కార్యక్రమాలకు సూత్రధారిగా అత్యున్నత శిఖరాలు అందుకున్న యశస్వి. తన వ్యక్తిత్వంతోనూ స్నేహ పరిమళాలతో వెలుగులు పంచిన పద్మవిభూషణ్ పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం. సింహపురి ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేసిన ఎస్పీ బాలు జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

8

- సింహపురి ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేసిన మహోన్నత వ్యక్తి
- ఆయన ఆశయాలను కొనసాగిస్తున్న స్నేహబృందం
- నేడు గాయని రమణకు పురస్కారం

రియల్.. ఢమాల్!

అమ్ముడుపోని స్థలాలు, ఇళ్లు ● భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్ ఆదాయం



ఒకప్పుడు ఓ ఊపు ఊపిన రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు కష్టకాలాన్ని ఎదుర్కొంటోంది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరుగుతున్న డాక్యుమెంట్ల సంఖ్యను చూస్తేనే ఈ పరిస్థితి అర్థమవుతోంది. ప్రధానంగా నెల్లూరు, కావలి వంటి పెద్ద ప్రాంతాల్లో దాదాపు సగం వరకూ రిజిస్ట్రేషన్లు పడిపోయాయి. అయితే ఆత్మకూరు, అల్లూరు వంటి ప్రాంతాల్లో మాత్రం రిజిస్ట్రేషన్ శాఖ సాధించిన గ్రోత్ ఎక్కువగా ఉండటం విశేషం.

జిల్లాలో రిజిస్ట్రేషన్ల వివరాలు

సంవత్సరం	డాక్యుమెంట్లు	లక్ష్యం(రూ.కోట్లు)	సాధన(రూ.కోట్లు)	శాతం
2023-24	1,88,229	669.75	480.34	71.72
2024-25	93,772	712.38	444.69	62.42

నెల్లూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : దాదాపు రెండు దశాబ్దాల క్రితం రియల్ రంగానికి ఊపు ప్రారంభమైంది. అది రాష్ట్ర విభజన తర్వాత తారస్థాయికి చేరుకుంది. భూములు, ఇళ్ల ధరలు అమాంతం పెరుగుతూ వచ్చాయి. కొనుగోలు చేసేవారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఎక్కడపడితే అక్కడ లేఅవుట్లు వెలిశాయి. అపార్ట్‌మెంట్లు, విల్లాలు, ఇళ్లు.. ఇలా నిర్మాణ రంగం కూడా జోరందుకుంది. నెల్లూరు నగరంలో అయితే ఒక రోజు చెప్పిన ధర మరుసటి రోజు ఉండేది కాదంటే అతిశయోక్తి కాదని రియల్ ఎస్టేట్ నిపుణులు గుర్తు చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం అంకణం విలువ రూ.లక్ష ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు రూ.3 లక్షలకు పెరిగిందంటే రియల్ ఎస్టేట్ వెలుగులు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే అంతస్థాయి నుంచి ఇప్పుడు కొనుగోలు చేసేవారు తక్కువవడంతో ఒక్కసారిగా బ్రేకులు పడ్డాయి.

● **తగ్గుతున్న ఆదాయం**

జిల్లాలో 15 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉండగా, వాటి పరిధిలో ఏటా టార్గెట్‌లు పెట్టుకొని పని చేస్తుంటారు. 2023-24లో రిజిస్ట్రేషన్ శాఖ రూ.669.75 కోట్లను లక్ష్యంగా పెట్టుకోగా చివరకు రూ.480.34 కోట్లే సాధించింది. ఇక 2024-25లో రూ.712.38 కోట్లకుగాను కేవలం రూ.444.69 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. అంటే అంతకుముందు ఏడాది సాధించిందే తక్కువ అనుకుంటే ఆ తర్వాత సంవత్సరం మరింత దిగజారింది. రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచినా ఆదాయం తగ్గడం గమనార్హం. ఇక రిజిస్ట్రేషన్ జరిగిన డాక్యుమెంట్ల సంఖ్య కూడా సగానికి పడిపోయింది. దీనిని బట్టే రియల్ ఎస్టేట్ రంగం ఎంతటి కష్టకాలాన్ని ఎదుర్కొంటుందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ప్లాట్లు, ఫ్లాట్లు కొనేవారు కరువయ్యారని వ్యాపారులు అంటున్నారు. గతంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని పెద్ద పెట్టుబడి మార్గంగా భావించేవారు. అలా పెట్టుబడి పెట్టిన వారు ఇప్పుడు స్థలాలు, ఇళ్లు అమ్ముకుందామంటే వీలుగాక ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం అనేక సమస్యలను పరిష్కరించింది. అనధికార లేఅవుట్లకు బ్రేకులు వేయడమేగాక కొత్త లేఅవుట్లలో రోడ్ల వెడల్పును కూడా తగ్గించి వ్యాపారులకు మేలు చేసింది. ఇసుకను ఉచితం చేసినా రియల్ ఎస్టేట్ రంగం వేగం పుంజుకోవడం అటుంచి మరింత పతనమవుతుండటంతో వ్యాపారులు, ఈ రంగం ద్వారా ఉపాధి పొందుతున్న వారు ఆందోళన చెందుతున్నారు. అయితే రియల్ ఎస్టేట్ రంగం కష్టకాలం అనుభవించడానికి మరో ప్రధాన కారణం కూడా ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మెట్రో సిటీలు, ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉండే ధరలు జిల్లాలో ఉంటున్నాయని చెబుతున్నారు. ధరలు అమాంతం పెరిగిపోవడంతో మధ్య తరగతి ప్రజలకు కొనుగోలు శక్తి లేకుండా పోయిందని అభిప్రాయపడుతున్నారు. ఇలా కొనుగోలు చేసే వారి సంఖ్య తగ్గడంతో పెట్టుబడులు పెట్టేవారు కూడా వెనకడుగు వేస్తుండటంతోనే కొత్త లేఅవుట్లు వేయడంగానీ, కొత్తగా అపార్ట్‌మెంట్లు, ఇళ్లు నిర్మించడం ఆశించినంతగా జరగడం లేదని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

వితంతువులకు 'భరోసా!

● జిల్లాలో 3,492 మందికి పెన్షన్లు ● 12న పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వితంతువులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత అందించింది. పింఛను పొందుతూ భర్త మృతి చెంది ఉంటే ఎన్టీఆర్ భరోసా కింద తక్షణమే భార్యకు సామాజిక పింఛను ఇచ్చి ఆదుకునేలా ప్రభుత్వం నిర్ణయించింది. వైసీపీ హయాంలో ఇటువంటి వారు దరఖాస్తు చేసుకున్నా పింఛను మంజూరు అవుతుందో లేదో తెలియని పరిస్థితి. అయితే, ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక 2024, నవంబరు 1వ తేదీ తరువాత మృతి చెందిన వారి భార్యలకు మరుసటి నెల నుంచే పింఛను అందజేస్తోంది. తాజాగా వైసీపీ హయాంలో అంటే 2023, డిసెంబరు 1 తరువాత ఎప్పుడు మృతి చెంది ఉన్నా (2024 అక్టోబరులోపు) అర్హులకు పింఛను ఇవ్వాలని ఆదేశాల జారీ చేసింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అటువంటి వారిలో 3,492 మందికి లబ్ధి చేకూరనుంది. కాగా, ఇప్పటివరకు 74,994 మంది వితంతువులు ఉండగా ఒక్కొక్కరికి రూ.4వేలు చొప్పున అందజేస్తున్నారు. మంజూరైన కొత్త పింఛన్లను ఈ నెల 12న పంపిణీ చేస్తారు.



ఉదయగిరిలో ఆందోళన చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

ఆర్టీసీ కార్మికుల పోరుబాట

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ డిపోల గ్యారేజ్ గేట్ల ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి టీ మురళీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ గతనెలలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశం తీర్మానం మేరకు, కార్మికుల సమస్యలపై యాజమాన్యం స్పందించకపోవడంతో ఐదు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. తొలి రోజు జిల్లాలోని ఏడు డిపోల్లో ఎర్ర రిబ్బన్‌లు ధరించి కార్మికులు నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు.

సఫాయి కర్మచారీల సంక్షేమాన్ని బాధ్యతగా తీసుకోండి

● సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సఫాయి కర్మచారీల ఆరోగ్య భద్రత, సంక్షేమాన్ని ఒక బాధ్యతగా భావించి పని చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ శంకరన్ సమావేశమందిరంలో జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ సఫాయి కార్మచారీలకు ఇళ్లు మంజూరు చేసి, వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి మూడు నెలలకోసారి వైద్యశిబిరాలు నిర్వహించాలని, ఈఎస్ఐ హెల్త్ కార్డులు అందించాలన్నారు. అలాగే, యోగాంధ్ర కార్యక్రమాల్లో సఫాయి కర్మచారీలను భాగస్వాములను చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, కమిటీ సభ్యులు, ఇతర అధికారులుపాల్గొన్నారు.

● **వెట్టిచాకిరి కార్మికులను గుర్తించండి**

వెట్టి చాకిరి వ్యవస్థలోని కార్మికులను గుర్తించి విముక్తులను చేసేందుకు ఆకస్మిక తనిఖీలు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. ఇటుక బట్టీలు, పరిశ్రమలు, వ్యాపార దుకాణాలు, రొయ్యలు, చేపల గుంటలు, రైస్‌మిల్లులు, హోటళ్లు తదితర ప్రదేశాల్లో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేయాలని సూచించారు. కార్మికులకు మెరుగైన ఉపాధి, సంక్షేమం అందించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు.



పులి వాహనంపై చాముండేశ్వరి దేవి

ఇందుకూరుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గంగపట్నంలో జరుగుతున్న శ్రీ చాముండేశ్వరి దేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం పులివాహనంపై అమ్మవారు కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు, గుండాల కృష్ణారెడ్డి, కొండూరు వెంకటరమణారెడ్డి, బొద్దుకూరు సుధీర్, కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఉంగరం కోసమే హత్య!

తోపూరి నరసింహం కేసు కొలిక్కి

లింగసముద్రం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సంచలనం రేపిన తోపూరి నరసింహం హత్య కేసు ఓ కొలిక్కి వచ్చింది. కేవలం ఉంగరం కోసమే హత్య చేశానంటూ విచారణలో నిందితుడు పోలీసులకు చెప్పారు. ఈ మేరకు చలంచర్ల బ్రహ్మయ్యను అరెస్ట్ చేసినట్లు గుడ్లూరు సీఐ మంగరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఆర్‌ఆర్ పాలెం దగ్గర ఉన్న నిమ్మతోటలో నరసింహంను హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలుగా చేసి బోరుబావిలో పడేసి ఉండటాన్ని ఆదివారం వెలుగులోకి వచ్చింది. దీనిపై పలుకోణాల్లో విచారించిన పోలీసులు ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం రావులకొల్లు గ్రామానికి చెందిన బ్రహ్మయ్యను అదుపులోకి తీసుకున్న పోలీసులు పూర్తిస్థాయిలో విచారించారు. నరసింహం చేతికున్న బంగారు పచ్చరాయి ఉంగరం అమ్ముకొని తన అప్పులు తీర్చుకోవాలనే ఉద్దేశంతోనే బ్రహ్మయ్య ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని సీఐ తెలిపారు. కాగా, కందుకూరు కోర్టులో బ్రహ్మయ్యను హాజరు పరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు.

జీజీహెచ్‌కు క్యాథ్‌ల్యాబ్!

రూ.5.67 కోట్లతో ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి



జీజీహెచ్‌లో ఏర్పాటు చేయనున్న అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్ ఇలాంటిదే

నెల్లూరు (వైద్యం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గుండె వ్యాధి గ్రస్థులకు ఓ శుభవార్త. నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో (జీజీహెచ్) ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత ఆధునిక గుండె వైద్య విధానాలు అందుబాటులోకి రానున్నాయి. సుమారు రూ.5.67 కోట్ల వ్యయంతో అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అంగికారం తెలిపింది. ప్రతిరోజు జీజీహెచ్‌కు 10 మంది రోగులు గుండెవ్యాధులతో వస్తుంటారు. వీరికి సాధారణ పరీక్షలు చేసి నారాయణ ఆసుపత్రికి, తిరుపతిలోని స్విమ్స్‌కు రెఫర్ చేస్తుంటారు. ఒక్కోసారి ఆలస్యం కావటంతో మరణాలు కూడా సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో క్యాథ్‌ల్యాడ్ వసే వ్యాధిగ్రస్థులకు చికిత్సలు అందచేసి పూడి పోయిన రక్త నాళాలను స్టంట్ వేసే అవకాశం ఉంటుంది. గుండెకు వెళ్లే రక్తనాళాల పరిస్థితిని ఈ క్యాథ్‌ల్యాబ్ ద్వారా గుర్తించి ఎన్ని నాళాలు పూడిపోయాయో గుర్తించి అత్యుత్తమ వైద్య చికిత్సలు అందించే వీలు కలుగుతుంది. దీంతోపాటు గుండె పంపింగ్ సామర్థ్యాన్ని గుర్తించవచ్చు. ఇంట్రా వాస్కులర్ అల్ట్రా సౌండ్ ద్వారా రక్తనాళాల గోడలను క్షుణ్ణంగా క్యాథ్‌ల్యాబ్ ద్వారా పరిశీలించవచ్చు. దీంతోపాటు డయాగ్నొస్టిక్ క్యాథటరైజేషన్ ద్వారా గుండె సమస్యలను తెలుసుకోవచ్చు. ఇటీవల గుండె వ్యాధులకు

- మిగతా 7లో..

ఆధునిక భవనాన్ని నిర్మించబోతున్నాం



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గుండె విభాగం ఏర్పాటు చేయాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు రాతపూర్వకంగా తెలియచేశాం. అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్ కావాలని అడిగాం. చాన్నాళ్లకు ఇప్పుడు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఆధునిక భవనాన్ని నిర్మించబోతున్నాం.

- డాక్టర్ సిద్ధానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

వలంటీర్ల కథ కంచికేనా!?

● ఏడాది అయినా కానరాని నియామకాలు ● ఎటూ తేల్చని రాష్ట్ర ప్రభుత్వం



నెల్లూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వలంటీర్ల వ్యవస్థ ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది. ఈ వ్యవస్థ లేకున్నా అన్ని పనులు సవ్యంగా జరిగిపోతున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నియామకాలు చేపట్టి ఖజానాపై అదనపు భారం వేసుకుంటుందా!? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వైసీపీ హయాంలో ప్రతి 100 కుటుంబాలకు ఒక వలంటీరు చొప్పున నియమించింది. ఆ కుటుంబాలకు అవసరమైన సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా అందించే ప్రయత్నం చేసింది. అయితే ఈ వ్యవస్థ పూర్తిగా రాజకీయ రంగు పులుముకోవడంతో ఎన్నికల కమిషన్ వలంటీర్లను విధుల నుంచి పక్కన పెట్టాలని ఆదేశించింది. ఆ క్రమంలోనే అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను తిరిగి విధుల్లోకి తీసుకుంటామని, ఇంకా మెరుగైన జీతం ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది.

● **ఏడాది గడుస్తున్నా..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం అవుతోంది. అయినా ఇప్పటివరకు వలంటీర్ల నియామకం విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. జిల్లాలోని రూరల్ ప్రాంతాల్లో 11వేల మంది, మున్సిపాలిటీల పరిధిలో 5వేలు, మొత్తం 16వేల మంది వలంటీర్లుగా పనిచేసేవారు. పునర్నియామకాలు జరిగితే వీరందరిని విధుల్లోకి తీసుకోవాలి. వీరిలో వైసీపీ నేతల ప్రలోభాలకు లొంగి అప్పట్లో 3వేల మంది వరకు రాజీనామాలు చేసి ఆ పార్టీ ప్రచారంలో పాల్గొన్నారు. వీరి స్థానంలో కొత్త వారిని నియమించినా, చివరి వరకు విధుల్లో కొనసాగిన 13వేల మందికి తిరిగి అవకాశాలు కల్పించాల్సి ఉంది. అయితే, కూటమి ప్రభుత్వం ఈ విషయంలో ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే వలంటీర్ల వ్యవస్థ లేకున్నా ఈ ఏడాది కాలం సంక్షేమ పథకాల పంపిణీ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. ప్రతి నెల 1, 2 తేదీల్లో లబ్ధిదారులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఇక రేషన్ పంపిణీ విషయంలోనూ కూటమి ప్రభుత్వం మళ్లీ పాత విధానాన్నే పునరుద్ధరించింది. చౌక దుకాణాల్లోనే సరుకుల పంపిణీ సవ్యంగా సాగుతోంది. గతంలో వలంటీర్లు నిర్వర్తించే పనుల్లో ఈ రెండే ప్రధానమైనవి. మిగిలిన సంక్షేమ పథకాల కోసం ప్రజలే నేరుగా సచివాలయాలకు వెళ్లి సంక్షేమ కార్యదర్శిని కలిసేవారు. ఇప్పుడు అదే జరుగుతోంది. మరోవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వలంటీర్ల నియామకం ఖజానాపై అదనపు భారం అవుతుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. జిల్లా పరిధిలో వలంటీర్ల వేతనం కింద నెలకు రూ.8 కోట్ల భారం రాష్ట్ర ఖజానాపై పడుతుంది. సంవత్సరానికి 96 కోట్ల

- మిగతా 7లో..

బుచ్చిలో నేడు కోవూరు ఎమ్మెల్యే పర్యటన

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీలోని 7, 8, 9 వార్డులలో బుధవారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పర్యటించనున్నారని బుచ్చి అర్బన్ టీడీపీ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులతో కలిసి పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తారని తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9352
వెండి కిలో ధర	రూ. 103100
వెండి ఒక గ్రాము	రూ. 106.10



కిడ్నీ రోగులకు డయాలసిస్ సెంటర్ వరం

● పొదలకూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్

పొదలకూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇటీవల సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చొరవతో ఏర్పాటైన 8 పడకల డయాలసిస్ సెంటర్ కిడ్నీ రోగులకు వరం అని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు.

?. డయాలసిస్ కేంద్రాన్ని ఎక్కువగా ఎవరు ఉపయోగించుకుంటున్నారు.

!. పొదలకూరు మండలంతోపాటు మారుమూల మండలాలైన చేజర్ల, కలువాయి, రాపూరు మండలాల రోగులు, చిత్తలూరు, మహమ్మదాపురం పీహెచ్‌సీ పరిధిలోని రోగులు ఉపయోగించుకుంటున్నారు.

?. రోజుకు ఎంతమందికి డయాలసిస్ చేస్తున్నారు. గత డిసెంబరు నుంచి ఎన్ని సెషన్‌లు జరిగాయి.

!. పొదలకూరు కేంద్రంలో 8 పడకలు ఉన్నాయి. వీటిలో రోజుకు 16 మందికి డయాలసిస్ చేస్తున్నాం. గత డిసెంబరు నుంచి 1400 సెషన్‌లు డయాలసిస్‌లు జరిగాయి.

?. కిడ్నీ రోగులు డయాలసిస్ చేయించుకోవాలంటే ఎవరిని సంప్రదించాలి.

!. పొదలకూరు సీహెచ్‌సీ లోని డయాలసిస్ కేంద్రం వద్ద మేనేజర్‌ని సంప్రదిస్తే క్రియాటిన్ పర్సంటేజ్‌ని బట్టి వారికి స్లాట్ బుక్ చేసుకోవడం జరుగుతుంది. క్రియాటిన్ శాతం ఎక్కువగా ఉంటే అవసరాన్ని బట్టి వెంటనే వారికి స్లాట్ ఇవ్వడం జరుగుతుంది.

?. సీహెచ్‌సీలో వైద్య సేవలు, సదుపాయాలు ఎలా ఉన్నాయి.

!. పొదలకూరు సీహెచ్‌సీలో అన్ని రకాల పరీక్షలతోపాటు ఫిజియోథెరపీ, డెంటర్ ఎక్స్‌రే కూడా ఉంది. ప్రజలు వీటిని ఉపయోగించుకోవాలి. అలాగే ఓపీ సాధారణ రోజుల్లో 250 మంది, సోమవారం రోజు 350 మంది వరకు వస్తున్నాయి. అన్ని రకాల శస్త్ర చికిత్సలు ఇక్కడ చేస్తారు.

కసుమూరులో పారిశుధ్య లోపం

● రోడ్డు పక్కనే చెత్త నిల్వలు ● పూడుకుపోయిన మురుగు కాలువలు

● పట్టించుకోని పంచాయతీ అధికారులు



కసుమూరులో రోడ్డు పక్కనే చెత్తతో నిండిన మురుగు కాలువ

వెంకటాచలం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు గ్రామాలు విశాలంగా ఉండేవి. జనాభా తక్కువగా ఉండడంతో గడ్డివాములు, పేడదిబ్బలు వేసుకోవడానికి ప్రత్యేక స్థలాలు ఉండేవి. కానీ నేడు జనాభా పెరిగిపోవడంతో ఇళ్లకే స్థలాలు చాలడంలేదు. దీంతో కొందరు రోడ్లను పేడదిబ్బలుగా వాడేస్తున్నారు. మరికొందరు తమ ఇళ్లల్లోని చెత్తతోపాటు పేడనుకూడా రోడ్లపైనే వేస్తున్నారు. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్నది. వర్షాలు వచ్చినపుడు రోడ్లపై పేడనీరు, చెత్తచెదారాలు ప్రవహిస్తున్నాయి. దీంతోపాటుగా రోడ్డు పక్కన వేసిన చెత్త, చెదారాలు గాలికి పైకి లేచివచ్చి వాహనదారులపై పడుతున్నాయి. పరిసరాల్లో తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో అంటువ్యాధులు కూడా ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

● పట్టించుకోని అధికారులు

పారిశుధ్యం గురించి ప్రచారం చేసే పంచాయతీ అధికారులు చెత్త గురించి పట్టించుకోవడం లేదు. ప్రధానంగా సర్వేపల్లి, గొలగమూడి, వెంకటాచలం, కాకుటూరు, తాటిపర్తిపాళెం, పూడిపర్తి, గూడ్లూరువారిపాళెం, ఇడిమేపల్లి, రామదాసుకండ్రిగ, నిడిగుంటపాళెం, గొలగమూడి తదితర గ్రామాల్లో ఎక్కువగా చెత్త సమస్య ఉంది.ముఖ్యంగా కసుమూరు దర్గా పరిసర ప్రాంతాల్లో ఉన్న అద్దె గృహాల వద్ద చెత్త నిల్వలు పేరుకుపోయాయి. సాగు కాలువలతోపాటు సైడ్ కాలువల్లో సైతం చెత్త నిల్వలే దర్శనమిస్తున్నాయి. పాస్టిక్ కవర్ల వాడకం విపరీతంగా ఉండడంతో కసుమూరులో పారిశుధ్యం లోపించింది. చెత్త నిల్వలు, పేడ దిబ్బలు, కాలువల్లో మురుగు ఉన్న చోట బ్లీచింగ్ చల్లించి పూర్తిస్థాయిలో పారిశుధ్యం మెరుగు పనులు చేపట్టాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులపైనే ఉంది. అలాగే కాకుటూరు, చెముడుగుంట పంచాయతీల పరిధిలో పందుల సంచారం ఎక్కువగా ఉంది. వీటి వల్ల ప్రజలకు అంటూ వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు చెత్త నిల్వలు, పేడదిబ్బలను వెంటనే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



కసుమూరులో అద్దె గృహాల పక్కనే చెత్త నిల్వలు

సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు

పొదలకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సర్వేపల్లి నియోకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం పట్టణంలో నిర్వహించారు. పంచాయతీ బస్టాండులో సాయంత్రం తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, యూత్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం తెలుగు యువత నాయకులు వెన్నపూస రాజారెడ్డి, బ్రహ్మదేవి చంద్ర, తిరుపతి పార్లమెంటు టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు కలగట్ల సందీప్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, మల్లినేని వెంకటేష్, ఆదాల మురళీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● ముత్తుకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీపి పటిష్టం చేస్తామని మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున్‌యాదవ్ తెలిపారు. మంగళవారం ముత్తుకూరు పార్టీ కార్యాలయంలో రాజగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. రాజకీయాల్లో రాజగోపాల్‌రెడ్డి శక్తివంతమైన నాయకుడన్నారు. సోమిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, కొత్తపల్లి రమేష్, ముత్యంగౌడ్, షేక్.అలిముత్తు, దీనయ్య, బొలిగర్ల శ్రీనివాస్‌యాదవ్, విష్ణువర్ధన్‌రావు, తొండమనాటి శ్రీధర్, అక్కయ్యగారి ఏడకొండలు, తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు



ముత్తుకూరు : వేడుకలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

నేటి నుంచి శ్రీజ్వాలాముఖి వార్షికోత్సవాలు

తోటపల్లిగూడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరిగొండలో ఉన్న శ్రీజ్వాలాముఖి అమ్మవారి వార్షికోత్సవాలు బుధవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఈ మూడు రోజులపాటు ఆలయ అర్చకులు బొడ్డుపల్లి శ్రీనివాసశర్మ, బొడ్డుపల్లి మోహనకృష్ణ శర్మలచే అమ్మవారికి విశిష్ట పూజలు, అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



విద్యార్థుల అభ్యున్నతికి కృషి

ముత్తుకూరు, జూన్ 3 (ఆంధ్ర జ్యోతి) : పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో 90 శాతం, అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను అదానీ కృష్ణపట్నం పోర్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ అభినందించారు. కృష్ణపట్నం, ముత్తుకూరు, వరగలిలోని జడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు ముత్తుకూరులోని అదానీ విద్యా మందిర్‌లకు చెందిన 38 మంది విద్యార్థులను మంగళవారం పోర్టులో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్, అదానీ ఫౌండేషన్ సీఎస్ఆర్ విభాగం ద్వారా పరిసర ప్రాంతాల అభివృద్ధికి నిబద్ధతతో చేస్తుందన్నారు. అదానీ ఫౌండేషన్ ద్వారా పోర్టు పరిసర ప్రాంతాల గ్రామాల్లో విద్యా అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ ఏడాది బోర్డు పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులందరినీ చూసి ఎంతో గర్విస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదానీ పోర్టు, అదానీ ఫౌండేషన్ అధికారులు ముత్తుకూరు, కృష్ణపట్నం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సరళ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో సీఈవో జగదీష్ పటేల్

రైతులకు ఆ మర్రి చెట్టే నమ్మకం!

కోవూరు ప్రాంతంలో వరి నాట్లు వేసిన రైతులు తమ పంట బాగా పండాలని కోరుతూ అనాదిగా ఓ మర్రి చెట్టుకు పూజలు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి ఆ మర్రి చెట్టు తమ పొలాన్ని కాపాడుతుందని పురాతన కాలం నుంచి పరిసర ప్రాంత రైతుల నమ్మకం. కోవూరు పీఆర్ఆర్ కాలనీలో రైల్వేట్రాక్ పక్క నున్న ఈ మర్రిచెట్టు వద్దకు భక్తులు ప్రతి నిత్యం వస్తుంటారు. వరినాట్లు పూర్తి చేసిన రైతులు పెద్దసంఖ్యలో పూజలు చేస్తుండటంతో ఈ ప్రాంతం రద్దీగా మారింది. ప్రత్యేకంగా ఆదివారం ముస్లింలు పూజలు చేస్తారు. మర్రిచెట్టు మొదట్లో నాగేశ్వరస్వామిని ప్రతిష్ఠించుకొన్నప్పటికీ ముస్లిం భక్తులు పూజలు చేయడం విశేషంగా భావిస్తారు.

- కోవూరు,(ఆంధ్రజ్యోతి)



కోవూరులో పూజలు అందుకొంటున్న మర్రి చెట్టు

అభివృద్ధిని చూసి ఓర్వలేని వైసీపీ

కొడవలూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : టీడీపీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ అసత్య ఆరోపణలు చేస్తున్నదని టీడీపీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు తువ్వర ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కొడవలూరులో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధికి ప్రజలు నీరాజనాలు పడుతున్నారని తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏడాది సుపరిపాలనపై పోస్టర్ ఆవిష్కరణ

వెంకటాచలం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావడంతో మంగళవారం జనసేన కార్యాలయంలో నేతలతో కలిసి ఆ పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు నిధులు తీసుకురావడంతోపాటు ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ పాలనను కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు పినిశెట్టి మహేష్, సందూరి శ్రీహరి, చల్లా చెంచయ్య, మణి, రామిరెడ్డి, రహీమ్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నిరంతరం యోగా సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడిని అధిగమించడంతోపాటు ఆరోగ్యకరంగా ఉంటారని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తాళ్ల నరసింహస్వామి అన్నారు. మంగళవారం బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని 1వ సచివాలయం అధికారులు, సిబ్బంది అధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిరంతరం యోగ సాధన చేయడంతో పాటు మితహారం తీసుకుంటే ఆరోగ్యాన్ని పెంపొందించుకుని వ్యాధులను అధిగమించవచ్చన్నారు. ఇంగ్లీషు మందులు వాడకం కూడా తగ్గుతుందని తెలిపారు. అనంతరం యోగా సాధన కార్యక్రమంలో పాల్గొన్న వారికి అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 17వవార్డు కౌన్సిలర్ తాళ్ల వైష్ణవి, టీడీపీ సీనియర్ నాయకుడు దొడ్ల కోదండరామిరెడ్డి, టీడీపీ కార్యకర్త పీ.సుమన్, తదితరులు పాల్గొన్నారు.

● **మనుబోలు :** ధ్యానంతో మనిషికి మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎంపీడీవో జలజాక్షి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మహిళలకు, పురుషులకు విడి విడిగా ధ్యాన కార్యక్రమాలను నిర్వహించారు. ధ్యానం ఎలా చేయాలి, శ్వాస ఎలా తీసుకోవాలి, ఎప్పుడు వదలాలన్న అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● **వెంకటాచలం :** యోగా తోనే శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమవుతుందని తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమనాయుడు తెలిపారు. వెంకటాచలంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండలస్థాయి యోగా పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన అధికారులు, కూటమి నేతలతో కలిసి యోగసనాలను ప్రదర్శించారు. అనంతరం మాట్లాడుతూ యోగాసనాలు క్రమపద్ధతిలో సాధన చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ చల్లా నాగార్జునరెడ్డి, నిడిగుంటపాళెం సాగునీటి సంఘం అధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కల్పన, సీఐ సుబ్బారావు, బీజేపీ మండలాధ్యక్షుడు అసనాపురం శ్రీనివాసులు, టీడీపీ నేతలు సండి రమణయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



యోగా సాధనలో పాల్గొన్న రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్, కౌన్సిలర్, టీడీపీ నాయకులు

వేసవి విజ్ఞాన శిబిరంతో మేధోశక్తి పెంపు



గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం పరిశీలిస్తున్న ఎంఈవో, ఇతర అధికారులు

● పరిశీలించిన ఎంఈవో దిలీప్‌కుమార్

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): బుచ్చి శాఖా గ్రంథాలయంలో 40 రోజులపాటు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించి పిల్లలకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎంఈవో దిలీప్‌కుమార్ అన్నారు. మంగళవారం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిబిరం ద్వారా పిల్లలు కథలు, కథనాలు, సృజనాత్మక కార్యక్రమాలు నేర్చుకుని వారి సామర్థ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. పిల్లల్లో చరవాణికి బానిస కాకుండా, ఏకాగ్రత, నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు యోగా, ధ్యానం ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి మంజులత, కార్యక్రమాల రూపకల్పన చేసిన గండికోట సుధీర్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, వేణు, డ్రాయింగ్ మాస్టర్ శేషయ్య, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తాళ్ల నరసింహస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.



వైసీపీ ప్రభుత్వ అవినీతి, కూటమి ప్రభుత్వ అభివృద్ధిపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

'అమృత్'లో అవినీతిని కప్పి పుచ్చేందుకే పైలాన్ ధ్వంసం

● వైసీపీ హయాంలో అంతా విధ్వంసం

● ఏడాది కూటమి పాలనతో అభివృద్ధి పరుగులు

● కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి

కావలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రవేశపెట్టిన అమృత్ పథకం పనులలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పాల్పడిన అవినీతిని కప్పి పుచ్చేందుకే పైలాన్ ధ్వంసం చేయించారని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆరోపించారు. తన అవినీతి వెలుగులోకి వస్తుందన్న ఉద్దేశంతోనే చౌదరిపాళెంను మున్సిపాలిటీలో విలీనం పేరుతో ఎన్నికల జరగకుండా చేశారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం కావలిలో వివిధపార్టీల నేతలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, పురప్రముఖులు, పాత్రికేయులు, వివిధవర్గాల వారికి ఏడాదిలో జరిగిన అభివృద్ధి, వైసీపీ హాయంలో జరిగిన విధ్వంసంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఎమ్మెల్యే వివరించారు. తాను చేసింది తప్పని చెపితే క్షమాపణ అడుగుతానని, న్యాయం అనుకుంటూ మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఆస్తి అయిన పైలాన్ ధ్వంసం అయితే ఆ పైలాన్‌ను ఆఫ్ట్రాల్ అంటూ ప్రతాప్‌రెడ్డి మాట్లాడటం దుర్మార్గమని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికలు జరగనందున 15వ ఆర్థికసంఘం నిధులు ఆగిపోయి అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడిందని అన్నారు. కావలి-దుత్తలూరు జాతీయరహదారి విస్తరణలో సమ్మర్‌స్టోరేజి ట్యాంకు నుంచి ఐడీఎస్ఎంటీ వరకు ఉన్న మున్సిపల్ పైపులైన్ కాంట్రాక్టర్ ధ్వంసం చేయడంతో రూ.7.4 కోట్ల నష్టం జరిగిందని వివరించారు. ఈ విషయంలో ప్రతాప్‌రెడ్డి కాంట్రాక్టర్ దగ్గర మామూళ్లు తీసుకున్నారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యే అయ్యాక ఆ నిధులు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అలాగే కూటమి ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఇప్పటి వరకు రూ.270 కోట్లు మంజూరు చేయించి వివిధ దశలలో జరుగుతున్న పనులను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చూపించారు. అలాగే వివిధ అభివృద్ధి పనులకు రూ.327 కోట్లతో ప్రతిపాదనలు పంపామని చెప్పారు.



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు

మద్యం సీసాల స్వాధీనం

నెల్లూరు(క్రైం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో అక్రమంగా నిల్వఉంచిన మద్యం సీసాలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని ఆకుతోట సమీపంలో గల పార్థసారథిన గర్‌లోని రాంమోహన్ నివాసంలో మంగళవారం తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వానికి పన్ను చెల్లించని 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రాంమోహన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు నెల్లూరు-1 ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. తమదైన శైలిలో విచారించగా విశ్రాంత మిలటరీ ఉద్యోగుల వద్ద మద్యం సీసాలు సేకరించి, వాటిని రూ.500 అదనంగా అమ్ముకుంటున్నానని రాంమోహన్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు ఎస్‌డీ ఖాలేషావలి, సీహెచ్ పూర్ణకుమార్, హెడ్‌కానిస్టేబుల్ ఎం.కిరణ్‌సింగ్ కానిస్టేబుళ్లు ఎన్.మునిరాజ్‌కుమార్, కే. రమణయ్య పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● అదుపులోకి 8మంది, రూ.70,180 స్వాధీనం

కలువాయి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెరుబొట్లపల్లి సమీపంలో పేకాట స్థావరంపై మంగళవారం ఇన్‌చార్జి ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 8మందిని అదుపులోని తీసుకోవడంతో పాటు వారి వద్ద ఉన్న రూ.70,180లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సరస్వతీనగర్‌లో ఇరువర్గాల వివాదం

నెల్లూరు(క్రైం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు, సరస్వతీ నగర్‌లో శిరీష, లక్ష్మీరెడ్డి కుటుంబాలు ఎదురెదురు ఇళ్లలో నివాసం ఉంటున్నాయి. ఆ రెండు కుటుంబాల మధ్య కొంతకాలంగా వివాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం శిరీష భర్త సుధాకర్‌పై ఓ కేఫ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడి వెనుక లక్ష్మీరెడ్డి ప్రమేయం ఉందన్న అనుమానంతో శిరీష కుమారుడు శ్రీను నేరుగా లక్ష్మీరెడ్డి ఇంటి వద్దకు వెళ్లాడు. ఇంటి వద్ద పార్క్ చేసి ఉన్న కారు అద్దాలను ధ్వంసం చేశాడు. దీంతో ఆగ్రహించిన లక్ష్మీరెడ్డికి చెందిన వారు శిరీష ఇంటి ముందు ఉన్న పూలకుండీలను ధ్వంసం చేశారు. ఈ మేరకు ఇరువర్గాల వారు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిచ్చిన ఫిర్యాదులను విచారిస్తున్నట్లు బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తెలిపారు.

యోగా సాధనతోనే ఆరోగ్యం

రాపూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : యోగా సాధన తోనే శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చని మండల పరిషత్ అధికారి మారెళ్ల భవాని తెలిపారు. మంగళవారం స్థానికంగా ఉన్న సచివాలయం కార్యాలయంలో యోగాంధ్ర-2025 భాగంగా యోగా విద్యపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. జీవన శైలిలో యోగా ఒక భాగం కావాలని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఉద్యోగులు, వెలుగు సిబ్బంది, మండల పరిషత్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



యోగాసనం వేస్తున్న ఉద్యోగులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250
కోడిగుడ్ల ధర (100): 525	

'వాత్సల్య'లో యోగా కార్యక్రమం

నెల్లూరు(హరనాథపురం), జూన్ 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని జనహిత-వాత్సల్య అనాథ శరణాలయం పిల్లలు మంగళవారం ప్రత్యేక యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యతను వివరించారు. వాత్సల్య విద్యార్థుల కోసం, శరణాలయం చుట్టుపక్కల ప్రాంతాల చిన్నారుల కోసం బుధవారం నుంచి ప్రతి రోజూ ఉదయం ప్రత్యేక ఉచిత యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



గ్రంథాలయాలు.. సమస్యలకు నిలయాలు

వేసవి విజ్ఞాన తరగతుల నిర్వహణ అంతంత మాత్రమే

నిధుల లేమితో మరమ్మతులకు నోచని వైనం



పురాతన భవనంలో జస్టిస్ అన్సారీ గ్రంథాలయం



ఏకేనగర్ చిల్డ్రన్స్ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో విద్యార్థులు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్3 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలను సరస్వతీ నిలయాలుగా భావిస్తారు. అవి విద్యార్థుల నుంచి ఉద్యోగుల భవిష్యత్ దిక్సూచి లుగా ఉన్నాయి. వాటిని విద్యా, ఉపాధులకు దివి టీలనే చెప్పాలి. రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధి చెందా లంటే గ్రంథాలయాలు పటిష్ఠంగా ఉండాలి. అలాంటి నగరంలో దీనావస్థలో ఉన్నాయి.

● తక్కువగానే గ్రంథాలయాలు

నగరంలో ఆరులక్షలకు పైగా జనాభా ఉంటే కేవలం ఏడు గ్రంథాలయాలు మాత్రమే ఉన్నాయి. జిల్లా గ్రంథాలయంతోపాటు నవాబుపేట రామకృష్ణ గ్రంథాలయం, రంగనాయకులపేట జస్టిస్ అన్సారీ గ్రంథాలయం, మూలాపేట గ్రంథాలయం, ఏకేనగర్ చిల్డ్రన్స్ గ్రంథాలయం, గాంధీబొమ్మ సెంటర్‌లో పద్మావతమ్మ గ్రంథాలయం ఉన్నాయి. ఇవన్నీ నిధుల లేమితో, నేటి అవసరాలకు అనుగుణంగా లేవు.

● జస్టిస్ అన్సారీ గ్రంథాలయం

సొంత బిల్డింగ్ ఉంది. 4313 పుస్తకాలు ఉన్నాయి. రోజూ దాదాపు 40 మందికిపైగా పాఠకులు వస్తారు. పుస్తక సభ్యత్వం ఉంది. ఈ బిల్డింగ్ పాతది కావడం తో వర్షం వస్తే అంతా ఉరుపే. చెదలు, ఫ్లోరింగ్ అం తా చెమ్మతో ఉంటుంది. పాఠకులకు చాలా అసౌక ర్యంగా ఉంది. పాతకాలం నాటి ఫర్నీచర్ ఉంది. కొన్ని కుర్చీలు అవసరం ఉంది. ఈ గ్రంథాలయం లైబ్రరీయన్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతులు జరుగుతు న్నాయి. కానీ వాటి నిర్వహణకు ప్ర భుత్వం నిధులు విడుదల చేయలేదు.



కూలేందుకు సిద్ధంగా ఉన్న నవాబుపేట రామకృష్ణ గ్రంథాలయం

● ఏకే నగర్ చిల్డ్రన్స్ గ్రంథాలయం

పొదలకూరురోడ్డు, హౌసింగ్‌బోర్డు, పార్కు వద్ద ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ గ్రంథాలయానికి పాఠకులు రోజూ 10 - 15మంది వ స్తారు. అలాగే ఈ లైబ్రరీకి 1200 స భ్యత్వాలు ఉన్నాయి. గ్రంథాలయ సంస్థకు అద్దె భవనం, మరమ్మతులు లేకపోవడంతో శ్లాబ్ ఉరుస్తోంది. చెద లు బెడద ఎక్కువగా ఉంది. లైబ్రేరి యన్ మేరీగ్రేస్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతులు జరుగుతున్నాయి. ఈ లైబ్రరరీ పరిసర ప్రాంతాలు తాగుబోతులకు, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా ఉన్నాయి. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

● రంగనాయకులపేట గ్రంథాలయం

ఈ గ్రంథాలయం భవనం పురాతనమైంది. మర మ్మతులు లేక వర్షం వస్తే ఉరిపే. వర్షాకాలంలో ఈ గ్రంథాలయంలోకి రావాలంటే పాఠకులు భయపడి పోతారు. పుస్తకాలు, ఫర్నీచరు బాగా నే ఉంది. రోజూ 30 నుంచి 40 మం ది పాఠకులు వస్తున్నారు. లైబ్రరీ యన్ సరళ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞా న తరగతులు జరుగుతున్నాయి.

● దొడ్ల పద్మావతమ్మ గ్రంథాలయం

ఈ గ్రంథాలయం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఉంది. తొలుత ఈ గ్రంథాలయాన్ని మహిళల కో సమే ప్రారంభించారు. ఈ గ్రంథాల యంలో బ్యాగులు విక్రయించే వ్యా పారులు ఆక్రమించారు. వారిని తొలగించేందుకు గ్రంథాలయ సంస్థ చేసిన ప్రయత్నాలు వృథాగా మారాయి. దీంతో ఈ లైబ్రరీకి మహిళలు రావాలంటే భయపడిపోయారు. దీంతో ఈ గ్రంథాలయాన్ని జనరల్ లైబ్రరీగా మార్చారు. ఇందులో 17వేల పుస్తకాలున్నాయి. రోజూ 40 నుంచి 50 మంది పాఠకులు వస్తున్నారు. లైబ్రరీయన్ మంజుల ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన తరగతులు జరుగుతున్నాయి.

● నవాబుపేట గ్రంథాలయం

నవాబుపేట శ్రీరామకృష్ణ గ్రంథాలయం చాలా పురాతన భవనంలో ఉంది. ఈ గ్రంథాలయంకు రోజూ పాఠకుల సంఖ్య బాగానే ఉంది. లైబ్రరీయన్ సు జాత ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతులు జరుగుతున్నాయి. ఈ లైబ్రరీని విస్తరించాల్సిన అవసరం ఉంది.

నిధుల్లేక మరమ్మతులు చేయలేదు

నగరంలోని నవాబుపేట, జస్టిస్ అన్సారీ గ్రం థాలయం, ఏకేనగర్ చిల్డ్రన్స్ గ్రంథాలయం, రం గనాయకులపేట గ్రంథాలయాలకు తక్షణ మర మ్మతులు చేయాలి. పాఠకులకు మెరుగైన సౌకర్యా లు కల్పించాలి. ప్రభుత్వం నిధులు ఇవ్వడంలేదు. గ్రంథాలయ సెస్సు వసూలు చేసుకోమంటుంది. నగర పాలక సంస్థ మున్సిపాలిటీలు ప్రజల నుంచి గ్రంథాలయాల సెస్సు వసూలు చేసుకుంటున్నారు. కానీ గ్రంథాలయ సంస్థకు చెల్లించడంలేదు.

- కుమార్ రాజా, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

బాలల సంక్షణ కోసం టాస్క్‌ఫోర్సు కమిటీ డ్రైవ్



తనిఖీల్లో టాస్క్‌పోర్సు అధికారులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 3(ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ, పునరావాసానికి సంబంధించి నగరంలో మంగళవారం టాస్క్‌పోర్సు కమిటీ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. నగరంలోని స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట, రేబాలవారి వీధి ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో నలుగురు బాలకార్మికులను గుర్తించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి వారిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షణ అధికారి బీసురేష్, కార్మికశాఖ సహాయ అధికారులు హరిబాబు, రామారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



మైనార్టీ గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న అవాజ్ కమిటీ నేతలు

నెల్లూరు (వైద్యం) జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడులో నిర్మిస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలతోపాటు, ఈ విద్యా సంవత్సరానికి పాఠశాలను సిద్ధం చేయాలని అవాజ్ కమిటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ రఫీ, షేక్ రషీద్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు గురుకుల పాఠశాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలలో వెంటనే మెస్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మరికొద్ది రోజుల్లో పాఠశాల ప్రారంభం అవుతున్నందున త్వరగా నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అవాజ్ రూరల్ అధ్యక్షుడు షేక్ నజీర్, అవాజ్ సభ్యులు జావీద్, నజీర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

బాలింతల వార్డుల పరిశీలన



బాలింతలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలిస్తున్న ఐద్వా నేతలు

నెల్లూరు (వైద్యం) జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత మహిళా సంఘం(ఐద్వా) నాయకురాళ్లు మంగళవారం జీజీహెచ్‌లోని బాలింతల విభాగాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను బాలింతలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐద్వా రూరల్ కార్యదర్శి షాహినాబేగం మాట్లాడుతూ ఇక్కడ వైద్యసేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. కొన్ని రకాల మందులు అందుబాటులో లేవని బయట కొనాల్సి వస్తున్నదన్నారు.

అలాగే ఆహారంలో నాణ్యత పెరగాలని బాలింతలు చెబుతున్నారని వెల్లడించారు. ఐద్వా రూరల్ అధ్యక్షురాలు వరలక్ష్మి మాట్లాడుతూ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించటానికి తమ బృం దం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు అరిగెల రమణమ్మ, షేక్ శంషాద్, జాకీర్, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

డీఎస్ఏ ఉద్యోగికి ఆర్థిక సాయం



జీవరత్నంను పరామర్శిస్తున్న సాఫ్ట్‌బాల్ సంఘం ప్రతినిధులు

నెల్లూరు(విద్య), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గ్రౌండ్ మార్కర్‌గా, స్వీపర్‌గా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న జీవరత్నంకు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ వారు ఆర్థికసాయం అందచేశారు. ఆయన కొంతకాలంగా తీవ్ర అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, మాజీ రంజీ క్రికెట్ క్రీడాకారులు మలిరెడ్డి కోటారెడ్డి, కార్యదర్శి కామేశ్వరి స్పందించారు. నగరంలోని డైకస్‌రోడ్డులోని బాధితుడి నివాసానికి మంగళవారం వెళ్లి రూ.10వేల ఆర్థికసాయం అందించి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఎన్నోఏళ్లుగా స్టేడియంలో సేవలందించిన జీవరత్నం పరిస్థితి దయనీయంగా ఉండడం బాధాకరమని, మానవత్వంతో స్పందించి అతనికి సాయం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ సంఘం సభ్యులు సుకృత, హరి, మహేష్ పాల్గొన్నారు.

వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రా మంలో వెలసి ఉన్న శ్రీవెంగమాంబ బ్రహ్మోత్సవాలు ఈనెల 15 నుంచి 19వ తేదీ జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే కా కర్ల సురేష్ మంగళవారం మాజీ ఉప రా ష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకి హైదరాబాదు జూబ్లీహిల్స్‌లోని తన నివా సంలో ఆహ్వానపత్రిక అందజేశారు. అనం తరం రెండు గంటలపాటు పలు అంశా లపై సుదీర్ఘంగా చర్చించి ఉదయగిరి అభివృద్ధిపై ఎమ్మెల్యేకు పలు సూచనలు, సలహాలు అందజేసినట్లు తెలిసింది. ఎ మ్మెల్యేతోపాటు ఆలయ ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు మల్లంపాటి గురవయ్యనాయుడు, మాదాల బాబురావు ఉన్నారు.

సోమశిలలో 41.680 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం జూన్ 3 (ఆంధ్ర జ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, మంగళవారం నాటికి 41.680 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో 428 క్యూసెక్కులు వస్తుండగా పెన్నాడెల్టాకు 3,080, ఉ త్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల నీటి సరఫరా చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

యోగా పోటీల్లో పాల్గొనండి

నెల్లూరు(సిటీ),జూన్3 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా నిర్వహిస్తున్న యోగా పోటీల్లో పాల్గొనాలని ఎన్ఎంసీ కమిషనర్ వైవో నందన్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 5న నెల్లూరు సిటీ, 6న రూరల్ ప్రాంతాల్లో ఈ పోటీలుంటాయని, ఇందులో విజేతలు అయినవారు జిల్లా స్థాయి పోటీలకు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. పూర్తి వివరాల కోసం కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేడు గ్రంథాలయ కమిటీ సమావేశం

నెల్లూరు(హరనాథపురం), జూన్ 3(ఆంధ్రజ్యోతి) : నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం కమిషనర్ నందన్‌తో గుర్రం జాషువా గ్రంథాలయ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ గ్రంథాలయ కార్యానిర్వాహక అధ్యక్షుడు షేక్ ఖాసీం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో గ్రంథాలయానికి సంబంధించిన పలు విషయాలను కమిషనర్ దృష్టికి తీసుకువెళతామన్నారు. సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

చెరువులు, కాలువల మరమ్మతులకు నిధులు

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు మైనర్ ఇరిగేషన్ చెరువులు, పంట కాలువల మరమ్మతులకు రూ.71 లక్షలు నిధులు మంజూరయ్యాయని ఇరిగేషన్ డీఈ హజరత్తయ్య తెలిపారు. మంగళవారం తనను కలిసిన విలేకర్లతో మాట్లాడుతూ ఈ పనులన్నింటిని త్వరలో ప్రారంభించి, రానున్న వర్షాల సీజన్ నాటికి పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

అంబులెన్స్ సేవలు ఉచితం

● జీజీహెచ్ వద్ద పేద రోగులకు.. ● రాష్ట్రంలోనే తొలిసారిగాలో.. ● సాయికుమార్ ఆలోచనతో కార్యాచరణ



జీజీహెచ్ ఎదుట ఉన్న అంబులెన్స్‌లు

నెల్లూరు (వైద్యం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వాసుపత్రికి పేద రోగులు రావాలంటే ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఇక జీ జీహెచ్‌లో చనిపోయినవారిని అంబులెన్స్‌లో ఇళ్ల కు తీసుకెళ్లలేక ఎంతోమంది నిరుపేదలు ఆ ర్థిక ఇబ్బందులతో తీవ్ర వేదనకు గురవుతుంటా రు. వారి వేదనల నుంచి వచ్చిన అద్భుత ఆలో చనే ఉచిత అంబులెన్స్ సేవలు. సీఐటీయూకి అనుబంధంగా నెల్లూరు అంబులెన్స్ వర్కర్స్ యూనియన్ ఉంది. దాని అధ్యక్షుడు సాయికు మార్ యాదవ్‌కు వచ్చిన ఈ ఆలోచనకు ఆ యన శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఉచిత అంబులెన్స్ సేవలు అందిస్తున్నారు.

● ఏప్రిల్ 16న అందుబాటులోకి...

ఈ అంబులెన్స్ సేవలు గత ఏప్రిల్ 16న అందుబాటులోకి వచ్చాయి. అత్యవసర రోగుల కోసం ఈ అంబులెన్స్‌లో ఆక్సిజన్‌తోపాటు బ్రెయిన్ సర్క్యుట్‌ను అందుబాటులో ఉంచారు. జీజీహెచ్ వద్ద మొత్తం 35 అంబులెన్స్‌లు ఉన్నాయి. యూనియన్ అధ్యక్షుడు సాయికుమార్ అందరినీ ఒప్పించి ఉచిత సేవలకు శ్రీకారం చుట్టారు. రోజూ రెండు అంబులెన్స్‌లు ఉచిత సేవలకు అందుబాటులో ఉండేలా చేశారు. బాధితులు ఎవరికైనా అంబులెన్స్ కావాలంటే 99495 29940 నెంబరుకు ఫోన్ చేస్తే వెంటనే ఉచిత అంబులెన్స్ వస్తుంది. ప్రస్తుతం నగరంలోని నారాయ ణ ఆసుపత్రి, మెడికవర్, ఇతర ఆసుపత్రుల వ రకు వీరి సేవలు విస్తరించారు. అలాగే చని పోయిన వారిని కొత్తకాలువ, బుజబుజనెల్లూరు, వెంకటేశ్వరపురం, కాకుపల్లి, వరకు చేర్చుతు న్నారు. ఇలాంటి సేవలు రాష్ట్రంలోని ఒక్క నె ల్లూరులోనే అందుబాటులో ఉన్నాయి.

సేవ చేయాలన్న ఆలోచనతోనే...



జీజీహెచ్ నుంచి మెరుగైన చికిత్సల కోసం ఆరోగ్య శ్రీ ఉన్న ప్రైవేట్ ఆసు పత్రులకు వెళ్లే కొంతమంది రోగు ల వద్ద అంబులెన్స్‌కు కూడా డబ్బులు ఉండ వు. అలాంటి వారిని ఎంతో మందిని చూశా. చివరకు చనిపోయిన వారిని ఇంటికి తీసుకుపోయే స్థితిలో కూడా లేని పేదలను కన్నీటిని చూసి ఆవేదన చెందా. మృతదేహాన్ని ఇంటికి తీసుకు పోవడానికి తన వద్ద డబ్బులు లేవని, మంగళసూత్రం తీసుకోమని ఓ మహిళ కన్నీరు పెట్టు కుంది. అలాంటి వారిని చూసి యూనియన్ సభ్యులతో మాట్లా డి ఉచితసేవలకు రెండు అంబులెన్స్‌లను అందుబాటులోకితెచ్చా. మమ్మల్ని ఆదర్శంగా తీసుకుని మరి కొంతమంది ముందుకు వస్తే ఎంతో మంచిది.

- సాయికుమార్, జిల్లా అంబులెన్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు

విద్యార్థులకు క్విజ్ పోటీలు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 3 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని జిల్లా గ్రంథాలయంలో మంగళవారం రామాయణం,మహాభారతంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం సైకిల్ దినోత్సవం సందర్భంగా సైకిల్ గురించి వివరించి, సైకిల్ చిత్రాన్ని సులభంగా గీసే విధానాన్ని రీసోర్సుపర్సన్ ఎం.సతీష్‌కుమార్ విద్యార్థులకు నేర్పించారు. సంప్రదాయ ఇండోర్‌గేమ్స్‌ను ఆడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ సునీ త, సిబ్బంది జితేంద్ర, గిరిజ, తదితరులు పాల్గొన్నారు.

సంగం : సంగంలో సీఐ వేమారెడ్డి ఫ్లెక్సీపై రోడ్డు నిబంధనలు రాసి వాహనదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం నియమ నిబంధనలు చదివించి వారిచే సంతకాలు చేయించారు.

గుకేష్ స్ఫూర్తితో చెస్‌లో రాణించాలి



బహుమతులు అందుకున్న క్రీడాకారులతో చెస్ సంఘం ప్రతినిధులు

నెల్లూరు(విద్య), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ చాంపియన్, తెలుగు జాతి గర్వించేలా కీర్తి గడించిన గుకేష్‌ను స్ఫూర్తిగా తీసుకుని, నేటితరం యువ చెస్ క్రీడాకారులు ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందేలా రాణించాలని ఎంజీబీ మాల్ ఎండీ గోపాలకృష్ణ అన్నారు. ఏపీ చెస్ అసోసియేషన్, శ్రీఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ సంయుక్తంగా ఎంజీబీ మాల్‌లో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయస్థాయిలో నాలుగేళ్లుగా చెస్ క్రీడలో భారత క్రీడాకారుల హవా కొనసాగిస్తున్నారన్నారు. భవిష్యత్‌లో ప్రపంచ చెస్ పోటీలకు భారత్ కీలకంగా మారనున్నదన్నారు. వర్ధమాన క్రీడాకారులంతా కూడా అవకాశాలను అందిపుచ్చుకుని చదరంగంలో ఉన్నతంగా ఎదగాలని తెలిపారు. అనంతరం క్రీడాశిబిరంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో మాల్ డిప్యూటీ జీఎం మల్లికార్జునరెడ్డి, అసిస్టెంట్ మాల్ మేనేజర్ కృష్ణ, రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వైసుమన్, చెస్ కోచ్ వెంకటరమణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

కాలువలో పూడికతీత



కాలువల్లో పూడికతీతను పరిశీలిస్తున్న టీడీపీ నేత డాక్టర్ గణేష్‌కుమార్

నెల్లూరు (వైద్యం) జూన్ 3 (ఆంధ్రజ్యోతి) :టీడీపీ నేత డాక్టర్ గణేష్‌కుమార్ ఆధ్వర్యం లో కాలువల్లో పూడికతీత చేపట్టారు. మం గళవారం 47వ డివిజన్ మహాలక్ష్మి గుడి సెం టర్‌లో ఈ పనులను చేపట్టగా, ఆయన పరిశీలించారు. టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్య క్షుడు ధర్మవరం సుబ్బారావు సహకారంతో ఈ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మునికృష్ణ, కంచికృష్ణ, మునికుమార్, రాధాకృష్ణ, సురేంద్ర సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల కథ కంచికేనా!?

(5వ పేజీ తరువాయి)


రూపాయలు. రాష్ట్ర వ్యాప్తంగా లెక్కిస్తే సుమారు 1500 కోట్లకుపైగా ఖజానాపై భారం పడుతుంది. వలంటీర్ల వ్యవస్థ లేకున్నా సంక్షేమ పథకాల అమలు సాఫీగా సాగుతున్నప్పుడు ఈ అదనపు భారం ఎందుకు!? అని ప్రభుత్వంలో ఉన్న ఆర్థిక నిపుణులు భావించే అవకాశం లేకపోలేదు. ఆ కారణంగానే అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా వలంటీర్ల వ్యవస్థ పునర్నియామకంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదనే ప్రచారం నడుస్తోంది.

జీజీహెచ్‌కు క్యాథ్‌ల్యాబ్!

(5వ పేజీ తరువాయి)


సంబంధించి ఓ వైద్య నిపుణురాలు నియమితులయ్యారు. క్యాథ్‌ల్యాబ్ వస్తే మరో ముగ్గురు గుండె వైద్యనిపుణులతోపాటు టెక్నీషియన్లను నియమించనున్నారు. ఆరు నెలల్లోపు ప్రత్యేక విభాగం నిర్మాణాలు జరిగే అవకాశం ఉంటుంది.

ఎంతో శుభపరిణామం



ఇది ఎంతో శుభపరిణామం. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను జీజీహెచ్‌కు కేటాయించటం సంతోషంగా ఉంది. ఇది అందుబాటులోకి వస్తే మరో ముగ్గురు గుండె వైద్య నిపుణుల నియామకం జరుగుతుంది. టెక్నీషియన్లు కూడా వస్తారు. గుండెకు సంబంధించి అన్ని రకాల వ్యాధులను గుర్తించే వీలు ఈ ఆధునిక క్యాథ్ ల్యాబ్ ద్వారా గుర్తించే వీలు కలుగుతుంది.


- డాక్టర్ మంజుల, గుండె వైద్య నిపుణులు, జీజీహెచ్



165 ఏళ్ల కిందట
ఉదయగిరిలో మెయిన్ బజార్

చారిత్రక స్మృతులు..
చెరగని జ్ఞాపకాలు

మహోన్నత ప్రాచీన చరిత్ర కలిగిన ఉదయగిరి దుర్గాన్ని పల్లవులు, చోళులు, గజపతులు, విజయనగర రాజులు, గోల్కొండ నవాబుల పరిపాలించారు. ప్రధానంగా 16వ శతాబ్దంలో విజయనగర రాజుల పాలనలో 365 ఆలయాలు, వాటి ముంగిట కోనేర్లతో ఉదయగిరి దేదీప్యమానంగా విరాజిల్లింది. రతనాలు రాశులుగా పోసి విక్రయించారని ఇప్పటికీ పెద్దలు చెప్పుకుంటున్నారు. విజయనగర రాజ్యానికి



బ్రిటీష్ వారు నిర్మించిన సబ్‌జైల్



బ్రిటీష్ వారు నిర్మించిన భవనంలో తహసీల్దారు కార్యాలయం

ఉదయగిరి సంహా ద్వారంగా ఉన్నట్లు చరిత్ర ఆధారాలు చెబుతున్నాయి. అలాగే 17వ శతాబ్దంలో గొల్కొడ నవాబు హైదర్ వుల్‌ముల్కు పాలనలో దుర్గంపై అనేక మసీదులు, దర్గాలు నిర్మించారు. 19వ శతాబ్దంలో బ్రిటీష్ దొర స్టోన్‌హౌస్ వారి పాలనలో నిర్మించిన భవనాలు నేటికీ చెక్కుచెదర లేదు. ప్రస్తుతం వారి నిర్మించిన భవనాల్లోనే తహసీల్దారు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. అలాగే బ్రిటీష్ వారు నిర్మించిన సబ్ జైలు, రాజీ అతిథిగృహం, బర్డిట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి భవనాలు, 165 ఏళ్ల నాటి ఉదయగిరి మెయిన్ బజార్, ఆంగ్లదొర తన సతీమణితో టాంగాలో సంచరిస్తున్న చిత్రాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఆ చారిత్రక స్మృతులు చెరగని జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి.

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)

జిల్లా గ్రంథాలయ సంస్థలో
బదిలీలు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంధాలయ సంస్థలో బదిలీ లు జరిగాయి. నెల్లూరులో డిప్యూటీ లైబ్రేరియన్‌గా ఉన్న ప్రసాద్‌ను గూడూరుకు, కావలిలో పనిచేస్తున్న ఎస్.సునీతను నెల్లూరు డిప్యూటీ లైబ్రేరియన్‌గా బదిలీ చేశారు. ఒంగోలులో పనిచేస్తున్న పీ.కోటేశ్వరిని కావలికి బదిలీ చేశారు. అలాగే సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఆర్.కుమార్‌ను గుంటూరుకు, గుంటూరు నుంచి ఎం.సీతారామయ్యను నెల్లూ రుకు బదిలీ చేశారు. వీరితోపాటు మరి కొందరిని రాష్ట్ర పబ్లిక్ గ్రంథాలయ సంచాలకులు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యం

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మంగళవారం మైపాడు బీచ్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. మైపాడు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు బీచ్‌లో యోగా సాధన చేయడం అందరినీ ఆకట్టుకుంది. సూర్యోదయాన... సాగర కెరటాల మధ్య, ఆహ్లాదకర వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు ఇన్‌చార్జ్ కలెక్టర్ కార్తీక్, ఆర్డీవో పావని ముఖ్య అతిథులుగా పాల్గొని సామూహిక యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం ఆరోగ్యంగా ఉండాలంటే మన జీవనశైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని, అందుకు యోగా గొప్ప సాధనమని అన్నారు. యోగాంధ్ర స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో ఓ భాగం చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ ఆరోగ్యంతో కూడిన అందమైన జీవన విధానానికి యోగా మంచి సాధనమన్నారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో జిల్లాలో ఇప్పటివరకు 8 లక్షల మంది



చిన్నారుల యోగాసనాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. 124 మంది మాస్టర్ ట్రైనీలను గుర్తించామని, అలాగే 7వేల మంది సాధారణ శిక్షకులను గుర్తించామన్నారు. వీరి ఆధ్వర్యంలో గ్రామ, వార్డు స్థాయిల్లో యోగా శిక్షణ కార్యక్రమాలు ఈ రోజు నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వూరు కల్యాణిరెడ్డి, వీరేంద్రనాయుడు, కమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చెంచుకిషోర్‌యాదవ్, ఏకొల్లు పవన్‌కుమార్‌రెడ్డి, పీఎల్‌రావు, ఏడుకొండలు, సుధాకర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మైక్రో ఇరిగేషన్ అధికారుల విచారణ

● మోసపోయిన రైతుల వివరాలు సేకరణ

ఉలవపాడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): డ్రిప్, స్ప్రింక్లర్ల సరఫరాలో చేతివాటంపై మైక్రో ఇరిగేషన్ జిల్లా అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. ఈనెల 2వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'డ్రిప్స్, స్ప్రింక్లర్లు సరఫరా పేరుతో కుచ్చుటోపి' కథనానికి స్పందించిన జిల్లా మైక్రో ఇరిగేషన్ పీడీ బీ శ్రీనివాసులు విచారణకు ఆదేశించారు. దీంతో మంగళవారం మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్(ఎంఐఈ) బాలాజిరెడ్డి, డివిజనల్ కోఆర్డినేటర్ రామ్మోహన్‌రెడ్డి మండలంలోని చాగొల్లు, ఉలవపాడు గ్రామాల్లో పర్యటించారు. చాగొల్లులోని తమ్మినేని సుజాత, తమ్మినేని నరసింహనాయుడు, ఊట్ల రామకోటేశ్వరరావు తదితర రైతులను విచారించగా ఉలవపాడు సచివాలయం అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఏడుకొండలు, అజయ్‌లు ఇద్దరు చెప్పడంతో మహేంద్ర ఇరిగేషన్ కంపెనీ ప్రతినిధి నారాయణకు రూ.70,000 చెల్లించామని వారు తెలిపారు. వీఏఏ అజయ్, ఏడుకొండలను ప్రశ్నించగా తొలుత నమ్మకం కుదిరేందుకు రూ.1,50,000 విలువ చేసే డ్రిప్స్ సరఫరా చేశాడని నమ్మి మండలంలోని 22 మంది రైతుల నుంచి అతని అకౌంటుకు సుమారు రూ.4 లక్షలు డబ్బులు చెల్లించినట్లు చెప్పారు. స్ప్రింక్లర్ల కోసం డబ్బులు చెల్లించిన రైతుల వివరాలు తీరుకున్నట్లు విచారణ అధికారులు తెలిపారు. దీనిపై సేకరించిన సమాచార నివేదికను మైక్రో ఇరిగేషన్ పీడీకి అందిస్తామని వారు తెలిపారు.

రెగ్యులేటర్‌కు తాళం కష్టాలు

మనుబోలు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రంలో కనిపిస్తున్న రెగ్యులేటర్ మనుబోలు దళితవాడలోనిది. మనుబోలు పెద్దచెరువు నీరు ఇటు కాలువలకు, అటు వాగుకిందకు వెళ్లేందుకు వీలుగా దీన్ని నిర్మించారు. గతేడాది దీనికి రూ.లక్షలతో మరమ్మతులు చేసి కొత్త చెక్కను ఏర్పాటుచేశారు. అయితే చెక్క ఎత్తేందుకు, దించేందుకు వీలుగా చేయడంతోపాటు లాక్ ఏర్పాటు చేయాల్సి ఉంది. లాక్ ఏర్పాటు చేయకపోవడంతో సాగునీటిని రైతులు ఎవరోఒకరు వదిలేస్తున్నారు. దీంతో అవసరంలేని పొలాలకు నీరు పారడంతో ఇబ్బందిగా ఉంటోందని రైతులు చెపుతున్నారు. అంతేగాక కాలువలకు నీరు వదిలినప్పుడు, పూర్తిగా చెక్కదిగక వాగుకు సాగునీరు వృథాగా పోతోంది. కావున తక్షణమే నీటిపారుదల అధికారులు స్పందించి చెక్కకు లాక్ ఏర్పాటుచేయాలని మనుబోలు సాగునీటి సంఘం అధ్యక్షులు పచ్చిపాల రామిరెడ్డి కోరుతున్నారు.



లాక్‌లేని రెగ్యులేటర్

సేవకు కేరాఫ్ సురేంద్ర

తోటి వారికి సేవ చేయాలంటే డబ్బు ఉండటమే ప్రామాణికం కాదు... దానికి మంచి మనసు, సత్సంకల్పం ఉండాలి. అలాంటి సంకల్ప బలం ఉంటే డబ్బు లేకపోయినా పదుగురి సహకారంతో ఆపన్నులను ఆదుకోవచ్చు, అట్టడుగు వర్గాల వారికి అండగా నిలవొచ్చు. ఇందుకు నిదర్శనం ఆటో డ్రైవర్ గంగపట్నం సురేంద్ర. సొంత ఇల్లు, సొంత ఆటో లేకపోయినా పేదలకు సాయం చేయాలన్న పెద్ద మనసున్నవాడు. తన స్వశక్తికితోడు దాతలను కూడగట్టుకుని సామాజిక సేవలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. ఆ సేవలే ఈ ఆటోవాలాను అందరివాడిగా మార్చి గౌరవ డాక్టరేట్ పొందే స్థాయికి చేర్చాయి.

- ఆటో నడుపుతూనే అపార సేవలు
- దాతలతోడుతో పేదలకు అండగా..
- ఉచిత ప్రయాణం, అన్నదానం, మొక్కల పెంపకం
- అనాథ శవాలకు అంత్యక్రియలు
- కుట్టు శిక్షణ, కళా సాంస్కృతిక సేవ
- స్ఫూర్తిదాయకంగా సామాన్యుడి జీవనం



వర్షంలో నిరుపేదలకు ఆహారం పంపిణీ చేస్తూ..

కావలి టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కావలికి చెందిన పేద రైతు గంటపట్నం వెంకటేశ్వర్లు, పుల్ల మ్మ దంపతుల కుమారుడు సురేంద్ర. ఆటో నడుపు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, కుమార్తె ఉన్నారు. ఆటో నడిపితేనే కుటుంబం గడిచే పరిస్థితి ఉన్నప్పటికీ ఎంతో కొంత సామాజిక సేవ చేయాలనే దృక్పథం కలిగి ఉండేవారు. ఈ క్రమంలో గర్భిణీలు, వృద్ధులను తన ఆటోలో ఉచితంగా గమ్యస్థానాలకు చేర్చేవారు. అతని సేవాస్ఫూర్తిని గమనించిన పట్టణ ప్రముఖులు, దాతలు సురేంద్రకు సొంత ఆటో వితరణ చేశారు. చిన్న ఇంటిని కూడా ఏర్పాటు చేశారు. వారిచ్చిన తోడ్పాటుతో సురేంద్ర సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పరిచారు. అతను చేస్తున్న సామాజిక సేవలను గుర్తించిన మనం ఫౌండేషన్ వారు ప్రముఖ సినీ నటుడు సుమన్, మాజీ మంత్రి వేణు గోపాలాచారి చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు.



సంయుక్త కుట్టు కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలతో..



గర్భిణిని ఆటోలో ఆసుపత్రికి తీసుకెళుతున్న సురేంద్ర

సేవలు ఇలా...

- సురేంద్ర 2012లో సంయుక్త సేవా సంస్థను స్థాపించారు. దాతల సహ కారంతో పేదలకు అన్నదానం చేసేవారు. పెళ్లిళ్ల, ఫంక్షన్లలో మిగిలిన ఆహారాన్ని ఆటోలో తీసుకెళ్లి పేదలకు పంచేవారు.
- మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంగా చేపట్టి పట్టణ పరిసర ప్రాంతాల్లో ఇప్పటికిదాకా పదివేలకు పైగా మొక్కలు నాటి వాటి సంరక్షణ చూస్తున్నారు.
- అనాథ, అభాగ్య పిల్లలకు ప్రతినెల నిత్యావసరాలు, విద్య, వైద్యం తదితర అవసరాలు తీరుస్తున్నారు. దాతల సహకారంతో అనాథల పేరిట పోస్టల్ ఖాతాలు తెరిచి ప్రతి నెలా రూ.వెయ్యి డిపాజిట్ చేయిస్తున్నారు.
- సంయుక్త ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం స్థాపించి ఎంతో మంది మహిళలకు కుట్టు నేర్పించి దాతల సహ కారంతో మిషన్లు అందిస్తున్నారు.
- అనాధ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.
- సంయుక్త నృత్య కళానిలయం స్థాపించి ఔత్సాహికులకు భరత నాట్యం, కూచిపూడిలో శిక్షణ ఇప్పించి సాంస్కృతిక కార్యక్రమాల్లో అవకాశం కల్పిస్తున్నారు.



డాక్టరేట్ అందుకుంటూ..

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

నెల్లూరు (వైద్యం) జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి 67 నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. మంగళ వారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళం పుల్లయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్ విలేకరులతో మాట్లాడారు.బద్వేలు నుంచి జిల్లాలోని గురువిందపూడి వరకు 108 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మించనున్నార న్నారు. ఇందుకోసం 6 మండలాల్లోని 38 గ్రామాల్లో 980 ఎకరాల భూమిని అధికారులు సేకరణ చేపట్టారన్నారు. 2013 భూసేకరణ చట్టంప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, పునరావాసం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల గురునాథం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకటరాజు, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక, రైతు సంఘం, కౌలు రైతు సంఘం నేతలు

వెన్నుపోటు, గొడ్డలివేటు పేటెంట్ జగన్‌దే !

నెల్లూరు (వైద్యం) (ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు, గొడ్డలివేటు పేటెంట్ హక్కులు మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికే ఉన్నాయని ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మంగళ వారం ఒక ప్రటనలో తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో 85 శాతం హామీలను ఎగ నామం పెట్టారని ఎద్దేవా చేశారు. ఆయన పొడిచిన వెన్ను పోటులు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. ఎత్తుకుని పెంచిన బాబాయిని కిరాతంగా చంపిన వారి ని కాపాడుతూ రక్త సంబంధానికి విలువ ఇవ్వలేదన్నారు. ఆస్తికో సం తల్లిని, చెల్లిని ఇం టినుంచి బయటకు గెం టేసి వెన్నుపోటు పొడిచారన్నారు. బీసీ, ఎస్టీ, ఎస్సి సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించి, సామాజిక న్యాయానికి వెన్నుపోటు పొడిచార న్నారు. తమ కూటమి ప్రభుత్వంలో 70 శాతం హామీలు అమలు చేశామని ఆయన వివరించారు.

అధ్యాపకుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

● ఏబీఆర్‌ఎస్‌ఎం

వెంకటాచలం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యా రంగంలో అధ్యాపకుల సమస్యలను వెంటనే పరిష్కారించా లని అఖిల భారతీయ రాష్ట్రీయ సైకిక్ మహా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు (ఏబీఆర్‌ఎస్‌ఎం) ప్రొఫెసర్ వైవీ. రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం మంగళ వారం ఓ సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. అధ్యాపకుల నియామకం, పెండింగ్ డీఏలు, సీపీఎస్ రద్దు, పదవీ విరమణ చేసిన అధ్యాపకులకు రావాల్సిన బకాయిల విడుదల, నూతన పీఆర్‌సీ ఏర్పాటు, డిగ్రీ కళాశాలల అధ్యాపకుల హోదా మార్పు, బదిలీలు, ఇంటీరియమ్ రిలీఫ్, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈహెచ్‌ఎస్ కార్డుల చెల్లుబాటు, యూనివర్సిటీల్లో శాశ్వత వీసీల నియామకం మొదలైన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభు త్వం కృషి చేయాలని వారు కోరారు. ఇప్పటికే ఏబీఆర్ ఎస్‌ఎం తరు పున సీఎం, విద్యాశాఖ మంత్రి, ఆర్థిక మంత్రి, ఉన్నత విద్యా విభాగం అధికారులకు వినతిపత్రాలు పంపామని తెలిపారు. అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోకపోతే, రాబోయే రోజుల్లో ఇతర ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఉద్యమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు.

65 ఏళ్లు నిండిన వారికి ఇంటి వద్దకే రేషన్

● ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అరవై అయిదేళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందచేస్తామని ఇన్‌చార్జి కలెక్టర్ కే. కార్తీక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధులు రేషన్‌షాపు వద్దకు రావాల్సిన అవసరం లేదన్నారు. డీలరు వారి ఇళ్లకు 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోగా వెళ్లి సరుకులు అందచేస్తారని తెలిపారు. వారికి ఫోన్ చేసి డీలర్ ముందస్తు సమాచారం ఇస్తారని తెలిపారు. జిల్లాలో 89 వేల మంది వృద్ధులు, దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు 55 శాతం మంది వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ సరుకులు అందచేశామని తెలిపారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కడపజిల్లా పుట్టంపల్లిలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ స్కూల్‌లో 4, 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో ఆర్‌కె.యతిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసే అభ్యరులకు సంబంధించిన పూర్తి సమాచారం, సీట్ల వివరాలన్నీ కూడా ఏపీ స్పోర్ట్స్‌స్కూల్ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హత కలిగిన వారు ఈనెల 16లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

పాటల్లో ఆయన పదిలం!

- సింహపురి ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేసిన మహోన్నత వ్యక్తి
- ఆయన ఆశయాలను కొనసాగిస్తున్న స్నేహబృందం
- నేడు గాయని రమణకు పురస్కారం
- నేడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి

నెల్లూరు వాసి అయిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విశ్వకళారుడిని అందించిన జిల్లాగా గుర్తింపు పొందింది. పండితారాధ్యుల సాంబమూర్తి, శకుంతలమ్మ దంపతులకు 1946లో బాలు జన్మించారు. బాలుకు ఇద్దరు సోదరులు, ఐదుగురు సోదరీమణులు ఉన్నారు. ఊహ తెలిసిన నాటి నుంచి ఎస్పీ బాలుకు సంగీతం పట్ల మక్కువ ఎక్కువే. 1966లో శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న చిత్రంతో సినీ రంగప్రవేశం చేసిన ఆయన తెలుగు, తమిళ చిత్రాలలో ఎన్నో పాత్రల్లో నటించి, మెప్పించారు. తెలుగు, తమిళం, హిందీతోపాటు 8 భాషల్లో 40వేలకుపైగా పాటలను పాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి 29సార్లు నంది పురస్కారాలు, 2001లో పద్మశ్రీ, 2011లో పద్మభూషణ్, ఆయన మరణానంతరం 2021లో పద్మవిభూషణ్ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం అందజేసింది. 2020, సెప్టెంబరు 25వ తేదీ ఆయన అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు.

కన్నతల్లిని, జన్మభూమిని మరువకుండా..

సినీ నేపథ్య గాయకుడిగా ఎంత బిజీగా ఉన్నా ఎస్పీ బాలు కన్నతల్లిని, జన్మభూమిని మరిచిపోలేదు. ప్రతి రోజు నెల్లూరులో ఉన్న తల్లి శకుంతలమ్మ ఆరోగ్యం, యోగక్షేమాలను స్నేహితుల ద్వారా తెలుసుకుని ఆమె అవసరాలు తీర్చేవారు. వీలు చూసుకుని నెల్లూరుకు వచ్చి తల్లిని చూసుకునేవారు. అంతేగాక పేద బంధువులకు, స్నేహితులకు ఎంతోమందికి ఆయన నగదు, మాట సాయం చేసి ఆదుకునేవారు. నగరంలోని శ్రీవెంకటేశ్వర కస్తూరిబా కళా క్షేత్రంలో అమరజీవి పద్మశ్రీ ఘంటసాల, తన తండ్రి పండితారాధ్యుల సాంబమూర్తి విగ్రహ ఏర్పాటుకు కృషి చేశారు.



● తన ప్రాణ స్నేహితుడు, నటుడు, రచయిత, దర్శకుడు వై.కామేశ్వరరావు పేరు మీద 14ఏళ్లపాటు జాతీయస్థాయి సాంఘిక నాటక పరిషత్‌లను నెల్లూరులో నిర్వహించారు. ఈ పరిషత్‌ల ద్వారా స్నేహితులు, స్నేహం విలువను అందరికీ తెలియజేశారు.

● ఎస్పీ బాలు పేరిట సినీ రంగంలో కళాకారులకు నెల్లూరులో జాతీయ పురస్కారాలు అందజేస్తున్నారు. 2016లో ప్రారంభించిన ఈ కార్యక్రమం ఇప్పటికీ కొనసాగుతునే ఉంది. ఈ ఏడాది గాయని బి.రమణకు బాలు జయంతి సందర్భంగా బుధవారం పురస్కారం అందజేయనున్నారు.

● వేద పాఠశాల కోసం నెల్లూరులోని తన ఇంటిని ఎస్పీ బాలు కంచి మఠానికి ఇచ్చారు. తన గానామృతంలో విశ్వఖ్యాతి గడించిన బాలసుబ్రహ్మణ్యంకు స్మారకంగా ప్రభుత్వం నగరంలోని సంగీత పాఠశాలకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీత పాఠశాలగా నామకరణం చేసింది. బాలాజీనగర్‌లో బాలసుబ్రహ్మణ్యం వీధి, పార్కును ఏర్పాటు చేయడంతోపాటు ఆయన విగ్రహాన్ని నగర పాలక సంస్థ ఏర్పాటు చేసింది.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

నా అదృష్టం



స్నేహం, స్నేహితులు అంటే బాలు ప్రాణం ఇచ్చేవాడు. ఆయన స్నేహ బృందంలో నాకూ చోటు లభించడం నా అదృష్టం. బ్యాంకు ఉద్యోగి అయిన నాకు సంగీతం, సాహిత్యం, సాంస్కృ తిక రంగాల పట్ల ఆసక్తిని కల్పించారు. బాలు ప్రేరణతోనే చేతన వేదికను ఏర్పాటు చేశాము. బాలు జయంతి, వర్ధంతి రోజున ఎన్నో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను.

- వై.శేషగిరీశం, చేతన వ్యవస్థాపకుడు

ఆపన్న హస్తం అందించారు!



తెలుగు భాషకు వన్నె తెచ్చింది ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. నందమూరి తారక రామారావులు. నేను అమెరికన్ కంపెనీకి మెడికల్ రెప్ర జెంటివ్ ఉద్యోగానికి ఎంపికై ముం బాయి పోవాలంటే ఆ రోజు నాకు సహాయం చేశారు. ఇలా నాలాంటి మిత్రులందరికీ ఏదో రూపంలో ఆపన్నహస్తం అందించారు. బాలు మరణించి నాలుగేళ్లు అయినా ప్రపంచమంతా ఆయన్ను ఇంకా గుర్తించుకొని వున్నారు.

- ఎం. ప్రసాదరావు

సోమశిలలో 41.680 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, మంగళవారం నాటికి 41.680 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 428 క్యూసెక్కులు వస్తుండగా పెన్నా డెల్టాకు 3,080, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల నీటి సరఫరా చేస్తున్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9352
వెండి కిలో ధర	రూ. 103100
వెండి ఒక గ్రాము	రూ. 106.10



వైసీపీ ప్రభుత్వ అవినీతి, కూటమి ప్రభుత్వ అభివృద్ధిపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

'అమృత్'లో అవినీతిని కప్పి పుచ్చేందుకే పైలాన్ ధ్వంసం

- వైసీపీ హయాంలో అంతా విధ్వంసం
- ఏడాది కూటమి పాలనతో అభివృద్ధి పరుగులు
- కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి

కావలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రవేశపెట్టిన అమృత్ పథకం పనులలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పాల్పడిన అవినీతిని కప్పి పుచ్చేందుకే పైలాన్ ధ్వంసం చేయించారని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆరోపించారు. తన అవినీతి వెలుగులోకి వస్తుందన్న ఉద్దేశంతోనే చౌదరిపాళెంను మున్సిపాలిటీలో విలీనం పేరుతో ఎన్నికల జరగకుండా చేశారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం కావలిలో వివిధపార్టీల నేతలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, పురప్రముఖులు, పాత్రికేయులు, వివిధవర్గాల వారికి ఏడాదిలో జరిగిన అభివృద్ధి, వైసీపీ హయంలో జరిగిన విధ్వంసంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఎమ్మెల్యే వివరించారు. తాను చేసింది తప్పని చెపితే క్షమాపణ అడుగుతానని, న్యాయం అనుకుంటూ మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఆస్తి అయిన పైలాన్ ధ్వంసం అయితే ఆ పైలాన్‌ను ఆఫ్టాల్ అంటూ ప్రతాప్‌రెడ్డి మాట్లాడటం దుర్మార్గమని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికలు జరగనందున 15వ ఆర్థికసంఘం నిధులు ఆగిపోయి అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడిందని అన్నారు. కావలి-దుత్తలూరు జాతీయరహదారి విస్తరణలో సమ్మర్‌స్టోరేజి ట్యాంకు నుంచి ఐడీఎస్‌ఎంటీ వరకు ఉన్న మున్సిపల్ పైపులైన్ కాంట్రాక్టర్ ధ్వంసం చేయడంతో రూ.7.4 కోట్ల నష్టం జరిగిందని వివరించారు. ఈ విషయంలో ప్రతాప్‌రెడ్డి కాంట్రాక్టర్ దగ్గర మామూళ్లు తీసుకున్నారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యే అయ్యాక ఆ నిధులు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అలాగే కూటమి ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఇప్పటి వరకు రూ270 కోట్లు మంజూరు చేయించి వివిధ దశలలో జరుగుతున్న పనులను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చూపించారు. అలాగే వివిధ అభివృద్ధి పనులకు రూ.327 కోట్లతో ప్రతిపాదనలు పంపామని చెప్పారు.



చౌకదుకాణాల్లో సమయపాలన పాటించాలి

- ఆత్మకూరు ఆర్డీవో పావని

ఆత్మకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు చౌకదుకాణాల్లో డీలర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలి. క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తాం. చౌకదుకాణాల పనితీరుపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటాం. రేషన్ పంపిణీలో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు ఆర్డీవో బీ పావని తెలిపారు.

? చౌకదుకాణాల్లో సమయపాలన ఎలా

! ప్రతిరోజు చౌకదుకాణాలు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయాలి.

? నెలలో ఎప్పటి వరకు రేషన్ సరుకులు తీసుకోవచ్చు

! ప్రతినెల ఒకటవ తేదీ నుంచి 15వ తేదీ వరకు చౌకదుకాణాల్లో రేషన్ సరుకుల పంపిణీ జరుగుతుంది. కార్డుదారులు ఆ రోజుల్లో ఎప్పుడైనా సరుకులు తీసుకోవచ్చు. అయితే 65 ఏళ్ల పైబడినవారికి, వృద్ధులు, వికలాంగులకు డీలర్లు ఇంటి వద్దకే వచ్చి సరుకులు అందజేస్తారు.

? రెవెన్యూ పరిధిలో సమస్యల పరిష్కారంపై తీసుకుంటున్న చర్యలు ఏమిటి

! రెవెన్యూ డివిజన్ పరిధిలో భూసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి సత్వర పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇస్తున్నాం. సివిల్ కోర్టులో పరిష్కరించుకోవల్సినవి మినహా పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను రెవెన్యూ కోర్టు ద్వారా పరిష్కరిస్తున్నాం. డివిజన్ పరిధిలో ప్రతినెల రెండు మండలాల్లో స్పెషల్ గ్రీవెన్స్ డే నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తున్నాం.

? భూ రీసర్వే ప్రక్రియ ఎంత వరకు వచ్చింది

! భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేశాం. సంగం, కొరిమెర్ల, కంద్రికలో పూర్తయింది. ఆత్మకూరు, చేజర్ల మండలాల్లో వారంలోపు పూర్తిచేస్తాం. మిగతా మండలాల్లో కూడా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

తాగునీటి పథకాలకు మోక్షమెప్పుడో..!

- ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



గండిపాళెంలో అలంకారప్రాయంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్

ఉదయగిరి రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజక వర్గంలో ఏళ్ల తరబడి తాగునీటి సమస్యలు వెంటాడుతున్నప్పటికీ పట్టించుకునే నాధులే కరువయ్యారనే విమర్శలు ఉన్నాయి. తాగునీటి పథకాలు మోరాయించడంతో చేసేదేమిలేక గుక్కెడు నీటి కోసం పడరాని పాట్లు పడాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. శుద్ధి నీటిని అందించేందుకు రూ. కోట్ల వ్యయంతో చేపట్టిన తాగునీటి పథకాలు అందని ద్రాక్షగానే ఉన్నాయంటూ చర్చించుకుంటున్నారు. వీటికి తోడు వేసవి ప్రభావంతో భూగర్భ జలాలు సైతం అడుగంటి పోవడంతో పరిస్థితులు మరీంత దారుణంగా ఉన్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందుకు సాగని ఎన్టీఆర్ స్రవంతి: గత తెలుగు దేశం ప్రభుత్వం 2018లో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు తాగునీరు అందించేం దుకు గానూ రూ. 15 కోట్ల నిధులను మంజూరు చేసింది. 2019 మార్చి నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉండగా, తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2021లో పేర్లు మార్చి చేతులు దులుపుకుందే తప్ప నిధులు మంజూరు చేయలేదు. దీంతో పథకం ముందుకు సాగే పరిస్థితి లేకుండా పోయింది. మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మదర్ ప్లాంట్లతో సహా గ్రామాల్లోని మినీ వాటర్ ట్యాంకులు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి.

మొరాయించిన రక్షిత పథకం: ఫ్లోరిన్ రహిత తాగునీటిని అందించాలనే సదుద్దేశంతో గండిపాళెం జలాశయ ప్రాంగణంలో రూ. 7.55 కోట్లు వెచ్చించి నిర్మించిన రక్షిత తాగునీటి పథకం సైతం మరమ్మతులకు గురై ఏళ్ల తరబడి నిరుపయోగంగానే ఉంది. దీంతో ఆ పథకం కింద ఉదయగిరి, వరికుంటపాడు, మర్రిపాడు, కొండాపురం, దుత్తలూరు మండలాలకు అందించాల్సిన తాగునీటి సరఫరా నిలిచిపోయింది.



గువ్వాడిలో నిరుపయోగంగా ఉన్న మినీ వాటర్ ట్యాంక్



జీ. కొత్తపల్లి వద్ద మరమ్మతులకు గురైన చేతిపంపు

శిథిలావస్థలో చేతిపంపులు: పలు గ్రామాల్లో రూ. లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన చేతిపంపుల పరిస్థితి కూడా అలాగే ఉన్నాయి. ప్రధానంగా కొండ్రాజుపల్లి, తూర్పుబోయమడగల, జీ. కొత్తపల్లి తదితర గ్రామాల బస్టాండ్ సెంటర్లతో పాటు గ్రామాల్లోనూ శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి పథకాలను వినియోగంలోకి తీసుకుని రావాలని పలువురు కోరుతున్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యఆరోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యాధికారులు

ఉదయగిరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో సంభవించే వ్యాధులపై వైద్యఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారులు శివకల్పన, వినీత తెలిపారు. మంగళవారం స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలు, వైద్యఆరోగ్య సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు చేయించుకునేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం నెలవారి నివేదికలు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు చెన్నయ్య, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు, కోతులను నివారించాలని వినతి



డిప్యూటీ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న షర్ఫుద్దీన్

ఉదయగిరి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కుక్కలు, కోతులను నివారించాలని మంగళవారం డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లాకు టీడీపీ నాయకుడు షేక్ గాజుల షర్ఫుద్దీన్ వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కుక్కలు, కోతులతో వీధుల్లో వృద్ధులు, మహిళలు, చిన్నారులు తిరగాలంటే భయాందోళనకు గురవుతున్నార న్నారు. పలువురు వృద్ధులు, చిన్నారులపై దాడులు చేసిన ఘటనలు కూడా ఉన్నాయన్నారు. అంతేకాకుండా ప్రధాన రహదారులపై గుంపులుగుంపులుగా కుక్కలు తిరుగుతూ వాహనదారులను సైతం ప్రమాదాలకు గురిచేస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి వాటి నివారణకు చర్యలు చేపట్టాలని వినతి పత్రంలో కోరారు.

కీటక జనిత వ్యాధులపై అప్రమత్తం అవసరం



మాసోత్సవాలపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

సంగం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కీటక జనిత వ్యాదులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అద నపు వైద్యాధికారి ఖాదర్‌వల్లి తెలి పారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో 1 నుం చి 30వ తేది వరకు జరిగే మాసోత్సవాల్లో భాగంగా కీటక జనిత వ్యాధులపై అవగాహన నిమిత్తం వైద్యశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భం గా జిల్లా అదనపు వైద్యాధికారి మాట్లాడుతూ దోమ కాటు నుంచి ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. టీబి ముక్త భారత్ కార్యక్రమంలో టీబీ కేసులను గుర్తించి నిక్షయ్ యాప్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూఏ కార్మికుల నిరసన

ఉదయగిరి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట మంగళవారం తెల్లవారుజామున నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా కమిటీ పిలుపు మేరకు ఆ సంఘ కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, సూర్యనారాయణ మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని గత నెలలో రీజనల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేసినా స్పందించకపోవడంతో నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ నిరసన కార్యక్రమం ఐదు రోజులపాటు కొనసాగించడం జరుగుతుందన్నారు. స్థానిక డిపో మేనేజర్ కార్మికులపై వ్యవహరిస్తున్న పక్షపాత వైఖరిపై విచారణ జరపాలని, అలాగే ఆత్మకూరు డిపో గ్యారేజీ కార్యదర్శి కిశోర్‌బాబు అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ నాయకులు కాశీవిశ్వనాథ్, వెంకటేశ్వర్లు, శివకుమార్, శంకర్, రాములు పాల్గొన్నారు.

తల్లి, చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి ప్రజలకు ఏం చేస్తాడు!

- ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జన్మనిచ్చిన తల్లికి, రక్తం పంచుకుని పుట్టిన చెల్లికి న్యాయం చేయలేని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తాడని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఒక ప్రకటనలో మంగళవారం పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీతో అందలమెక్కి కోట్లు గడించి నమ్ముకున్న ప్రజలను, ఆ పార్టీని వెన్నుపోటు పొడిచిన ఘనత జగన్‌దేనన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో 30 ఏళ్ల వెనక్కి వెళ్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 70 శాతం హామీలను అమలు చేసిందన్నారు. మొదటి నెలలోనే సామాజిక పింఛన్లు పెంచి ఏడాదికి రూ.34 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. అలాగే రూ.1,200 కోట్లతో రోడ్లు బాగు చేశారన్నారు. అంతేకాకుండా ధాన్యం రైతులకు రూ.1,674 కోట్లు బకాయిలు విడుదల చేశారన్నారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

విధుల్లో అలసత్వం వహించరాదు



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో సునీత

ఉదయగిరి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విధుల్లో అలసత్వం వహించకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలని ఐసీడీఎస్ సీడీపీవో సునీత తెలిపారు. మంగళవారం స్థానిక సెయింట్‌మేరీస్ పాఠశాలలో ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్రాల పరిధిలోని ప్రీస్కూల్ చిన్నారుల నమోదు చేపట్టాలన్నారు. వేసవి సెలవులు ముగిసినందున కేంద్రాలను శుభ్రం చేయాలని, కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేసి అవగాహన కల్పించాలన్నారు. కేంద్రాల నిర్వహణలో సమయపాలన పాటించాలని, అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు షేక్ షాను, తేజస్విని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నియమ నిబంధనలపై వాహనదారులకు అవగాహన



వాహనదారులతో రోడ్డు నిబంధనలు చదివించి సంతకాలు చేయిస్తున్న సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్

సంగం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సంగంలో సీఐ వేమారెడ్డి ఫ్లెక్సీపై రోడ్డు నియమ నిబంధనలు రాసి వాహనదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం నియమ నిబంధనలు చదివించి వారిచే సంతకాలు చేయించారు. వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు నియ మ నిబంధనలు అతిక్రమిస్తే వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. బైక్ నడిపేవారు హెల్మెట్, కారు నడిపేటప్పుడు సీటు బెల్టు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, వాహనదారులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు

మద్యం సీసాల స్వాధీనం

నెల్లూరు(క్రైం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో అక్రమంగా నిల్వఉంచిన మద్యం సీసాలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని ఆకుతోట సమీపంలో గల పార్థసారథినగర్‌లోని రాంమోహన్ నివాసంలో మంగళవారం తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వానికి పన్ను చెల్లించని 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రాంమోహన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు నెల్లూరు-1 ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. తమదైన శైలిలో విచారించగా విశ్రాంత మిలటరీ ఉద్యోగుల వద్ద మద్యం సీసాలు సేకరించి, వాటిని రూ.500 అదనంగా అమ్ముకుంటున్నానని రాంమోహన్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు ఎస్‌డీ ఖాలేషావలి, సీహెచ్ పూర్ణకుమార్, హెడ్‌కానిస్టేబుల్ ఎం.కిరణ్‌సింగ్ కానిస్టేబుళ్లు ఎన్.మునిరాజ్‌కుమార్, కే. రమణయ్య పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- అదుపులోకి 8మంది, రూ.70,180 స్వాధీనం

కలువాయి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెరుబొట్లపల్లి సమీపంలో పేకాట స్థావరంపై మంగళవారం ఇన్‌చార్జి ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 8మందిని అదుపులోని తీసుకోవడంతో పాటు వారి వద్ద ఉన్న రూ.70,180లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సరస్వతీనగర్‌లో ఇరువర్గాల వివాదం

నెల్లూరు(క్రైం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు, సరస్వతీ నగర్‌లో శిరీష, లక్ష్మీరెడ్డి కుటుంబాలు ఎదురెదురు ఇళ్లలో నివాసం ఉంటున్నాయి. ఆ రెండు కుటుంబాల మధ్య కొంత కాలంగా వివాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం శిరీష భర్త సుధాకర్‌పై ఓ కేఫ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడి వెనుక లక్ష్మీరెడ్డి ప్రమేయం ఉందన్న అనుమానంతో శిరీష కుమారుడు శ్రీను నేరుగా లక్ష్మీరెడ్డి ఇంటి వద్దకు వెళ్లాడు. ఇంటి వద్ద పార్క్ చేసి ఉన్న కారు అద్దాలను ధ్వంసం చేశాడు. దీంతో ఆగ్రహించిన లక్ష్మీరెడ్డికి చెందిన వారు శిరీష ఇంటి ముందు ఉన్న పూలకుండీలను ధ్వంసం చేశారు. ఈ మేరకు ఇరువర్గాల వారు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిచ్చిన ఫిర్యాదులను విచారిస్తున్నట్లు బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తెలిపారు.

యోగా సాధనతోనే ఆరోగ్యం



యోగాసనం వేస్తున్న ఉద్యోగులు

రాపూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : యోగా సాధనతోనే శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చని మండల పరిషత్ అధికారి మారెళ్ల భవాని తెలిపారు. మంగళవారం స్థానికంగా ఉన్న సచివాలయం కార్యాలయంలో యోగాంధ్ర-2025 భాగంగా యోగా విద్యపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. జీవన శైలిలో యోగా ఒక భాగం కావాలని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఉద్యోగులు, వెలుగు సిబ్బంది, మండల పరిషత్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు మాజీ ఉప రాష్ట్రపతికి ఆహ్వానం



వెంకయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

దుత్తలూరు (ఉదయగిరి), జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో వెలసి ఉన్న శ్రీవెంగమాంబ బ్రహ్మోత్సవాలు ఈనెల 15 నుంచి 19వ తేదీ జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మంగళవారం మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకి హైదరాబాదు జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆహ్వానపత్రిక అందజేశారు. అనంతరం రెండు గంటలపాటు పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించి ఉదయగిరి అభివృద్ధిపై ఎమ్మెల్యేకు పలు సూచనలు, సలహాలు అందజేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యేతో పాటు ఆలయ ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు మల్లంపాటి గురవయ్యనాయుడు, మాదాల బాబురావు ఉన్నారు.

గ్యాస్ బండ సరఫరాలో అక్రమాలు

- డెలివరీ చేస్తే రూ.20 అదనం
- పట్టించుకోని అధికారులు



గ్యాస్ బండ సరఫరా చేసే ఆటో

అనంతసాగరం జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్యాస్ ఏజెన్సీ నిబంధనలు పాటించకపోవడంతో డెలివరి బాయ్స్ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. గ్యాస్ బండ డోర్ డెలివరి చేసే సమయంలో రూ.20లు అదనంగా వసూలు చేస్తున్నారంటూ వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలూ ఉన్నాయి. గ్యాస్ ఏజెన్సీ నుంచి నాలుగు వాహనాల్లో రోజువారి గ్యాస్ సిలిండర్ల సరఫరా జరుగుతోంది. గ్యాస్ బండ ఇచ్చే సమయంలో తూకం వేసి వినియోగదారుడికి ఇవ్వాలి అయితే ఆ దిశగా చర్యలు లేవు. తూనికలు కొలతల అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా వినియోగదారుడు గ్యాస్ బుక్ చేసుకున్న నిర్దేశిత గడువు లోపల సిలిండర్‌ను సరఫరా చేయకపోవడంతో ఇబ్బందులు కూడా ఎదుర్కొంటున్నారు. కొన్ని అత్యవసర సందర్భాల్లో వినియోగదారులు గోడౌన్ వద్దకు వెళ్లి సిలిండర్ తెచ్చుకున్నా రూ.20లు అదనంగా ఇవ్వాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. అలాగే గ్రామంలో సరఫరా చేస్తే ఎమ్మార్పీ ధరకు ఇవ్వాలి. ఇతర గ్రామాలకు సరఫరా చేసినా దూరాన్ని బట్టి చార్జి వేయాల్సి ఉంటుంది. కాని అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు. మండలానికి మరో ఏజెన్సీ అందుబాటులోకి తెచ్చి గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 525

రాష్ట్ర మంత్రి స్వామిని కలిసిన ఇంటూరి

కందుకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అమరావతి వెలగపూడి సచివాలయంలో మంగళవారం రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామిని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గం లోని పలు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు, అదేవిధంగా రాష్ట్ర రాజకీయాలపై చర్చించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.



న్యూస్ బాక్స్

నేడు ప్రత్యేక పీజీఆర్ఎస్

లింగసముద్రం, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దారు ఎస్ సీతామహాలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకుని తమ భూ సమస్యలు, ఇతర సమస్యలపై అర్జీలు అందజేసి పరిష్కరించుకోవాలని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కావలి, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణం బాలకృష్ణారెడ్డినగర్ సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను మంగళవారం మధ్యాహ్నం అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1800 స్వాధీనం చేసుకున్నట్లు కావలి రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి తెలిపారు. పేకాట ఆడుతున్న సమాచారం తెలియగానే సీఐ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్ఐ తమ సిబ్బందితో దాడులు చేసి వారిని అరెస్ట్ చేశారు. అనంతరం సీఐ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఎక్కడైనా గ్రామాల్లో పేకాట, కోడి పందాలు ఆడుతున్నట్లు, గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియచేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కందుకూరు టౌన్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని శివాలయం ఫీడర్‌లో 11 కేవీ విద్యుత్ లైన్‌కు అవరోధం కలిగించే చెట్ల కొమ్మలను తొలగించేందుకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ నరసింహం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా మండలంలోని పాలూరు ఫీడర్ పరిధిలోని 11 కేవీ విద్యుత్ లైన్‌కు తగిలే చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు తెలిపారు. దీంతో ఆప్రాంతంలో కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు గమనించి సహకరించాలని పేర్కొన్నారు.

అండర్-23 బాస్కెట్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

కందుకూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : అండర్-23 బాలుర బాస్కెట్ బాల్ ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టును మంగళవారం ఎంపిక చేశారు. బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరి తొట్టెంపూడి సుబ్బారావు పర్యవేక్షణలో ప్రతిభ కనపరిచిన యువకులచే జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఈ జట్టు ఈనెల 4, 5 తేదీల్లో చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచి జిల్లాకు గుర్తింపు తేవాలని అసోసియేషన్ అధ్యక్షుడు వలేటి రవీంద్ర, సెక్రటరీ సుబ్బారావులు ఆకాంక్షించారు.

వెన్నుపోటు దినం గోడపత్రిక ఆవిష్కరణ

వలేటివారిపాలెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం వైసీపీ కార్యాలయంలో వైసీపీ మండల అధ్యక్షుడు అనుమోల లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో మంగళవారం వైసీపీ నాయకులు వెన్నుపోటు దినం గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జీ బుర్రా మధుసూదన్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం కందుకూరులో జరగనున్న వెన్నుపోటు దినం ర్యాలీకి కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కట్టా హనుమంతరావు, వలేటి మాల్యాద్రి, నల్లమోతు చంద్రమౌళి, చింతలపూడి రవీంద్ర, మర్రి అంజయ్య, పొట్టేళ్ల క్రిష్ణయ్య, ఇరపని అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఉప్పు కువ్వలు (ఫైల్)

తగ్గిన ఉప్పు ఉత్పత్తి

- రుతుపవనాల రాకతో చల్లబడ్డ వాతావరణం
- ఉష్ణోగ్రత లేక నిలిచిన తయారీ

అల్లూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో ఉప్పు సాగు నిలిచిపోయింది. రుతుపవనాల రాకతో వాతావరణం చల్లబడింది. ఫలితంగా ఉత్పత్తి పూర్తిగా ఆగిపోయి, కయ్యలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రతీ ఏటా మార్చి నుంచి అక్టోబరు వరకు ఉప్పు ఉత్పత్తి చేస్తుంటారు. ఈ సారి రుతుపవనాలు ముందుగానే రావడంతో పరిస్థితి మారింది. కాగా ఈ ఏడాది వేసవిలో ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. ధర క్వింటం కనిష్ఠంగా రూ.300 ఉండగా, గరిష్ఠంగా రూ.450 పలికింది. దీంతో రైతులకు భారీగానే ఆదాయం రావాల్సి ఉంది. కానీ వాతావరణ మార్పులు వారి పాలిట శాపంగా మారాయి. ఈ క్రమంలో ధరలు ఉన్నా ఉప్పు ఉత్పత్తి లేక రైతులకు లాభం లేకుండా పోయింది.

ధరలు బాగానే ఉన్నాయి



ఈ ఏడాది ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. కానీ ఉత్పత్తి లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి. ధరలు ఉంటే ఉత్పత్తి ఉండదు. ఉత్పత్తి ఉంటే ధరలు రావు. ఈ విధంగా ఉప్పు రైతులు జీవితాలు నిలకడలేకుండా పోతున్నాయి.


-పురిణి ఏడుకొండలు, ఉప్పు రైతు, తూర్పు గోగులపల్లి, అలూరు మండలం

రుతుపవనాలు మా పాలిట శాపం



ప్రతిఏటా రుతుపవనాలు సమయానికి రాకుండా ఆలస్యమవడం వింటున్నాం. కానీ ఈ ఏడాది ముందుగానే రావడం మా పాలిట శాపంగా మారింది. మేలో ఉప్పు ఉత్పత్తి బాగావచ్చే అవకాశం ఉన్నా, రుతుపవనాలరాకతో నష్టం జరిగింది.

-చెవికల శ్రీనివాసులు, ఉప్పు రైతు, ఇస్కపల్లి, అల్లూరు మండలం



విద్యార్థులకు పంపిణీకి పాఠ్య, నోటుపుస్తకాలు సిద్ధం

- పీపీ నరసింహారావు, ఉపవిద్యాశాఖాధికారి, కందుకూరు

కందుకూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థినీ విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్యపుస్తకాలన్నీ సిద్ధంగా ఉన్నాయి. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో నిరుపేదల పిల్లలకు 1వ తరగతిలో 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలన్న ప్రభుత్వ నిబంధనను కఠినంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కందుకూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పీపీ నరసింహారావు తెలిపారు.

? పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు పాఠ్య, నోట్‌బుక్స్, ఇతర మెటీరియల్ పంపిణీ చేస్తారా.

! కందుకూరు డివిజన్‌లోని ఏడు మండలాలకు సంబంధించి పూర్తిస్థాయిలో పాఠ్య, నోట్‌పుస్తకాలు వచ్చేశాయి. ఇప్పటికే 19,636 సెట్లు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలను ఆయా పాఠశాలకు చేర్పించాం. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులందరికీ పంపిణీ చేస్తాం.

? ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు ఉచితంగా 25 శాతం సీట్లు ఇవ్వాలన్న నిబంధనకు అమలు చేస్తున్నారా. దరఖాస్తు చేసుకోవడం ఎలా.

! ఈ నిబంధన మేరకు ప్రతి సంవత్సరం 1వ తరగతిలో చేరేవారికి 25 శాతం ఫ్రీ సీట్లు ఇప్పిస్తాం. వారికి 10వ తరగతి వరకు ఉచిత విద్య అందుతోంది. దీనికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి ఏటా ఆ జాబితా ప్రభుత్వం నుంచే మాకు అందుతోంది. ఈ ఏడాది ఇంకా పూర్తిస్థాయిలో వివరాలు అందలేదు.

? ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్స్ చూపిస్తూ ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య అధికంగా ఉందన్న విమర్శలు నిజమేనా.

! అలాంటి ఫిర్యాదులేవీ మాదృష్టికి రాలేదు. ఎంఈవోలను విచారించి ఆకస్మిక తనిఖీల ద్వారా కఠిన చర్యలు తీసుకోమని ఆదేశాలు జారీచేస్తాం. మేము కూడా తనిఖీలు చేసి ఏవైనా ఉదంతాలు బయటపడితే తగు చర్యలు తీసుకుంటాం

? ఈ ఏడాది కందుకూరు డివిజన్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ పాస్ పర్సంటేజీ గణనీయంగా తగ్గడంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు.

! గత ఏడాది అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది అకడమిక్ ఇయర్ ప్రారంభం నుంచే ప్రత్యేక దృష్టి సారించి పాస్ పర్సంటేజీ పెరగడంతో పాటు ఉత్తమ ఫలితాలు సాధించేలా పర్యవేక్షించడం జరుగుతోంది.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు

కొండాపురం, మే 3(ఆంధ్రజ్యోతి): దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్ ఎస్ అక్బర్‌బాషా పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి స్థానిక బస్టాండు కూడలి వరకు సాగిన ర్యాలీలో మలేరియా వ్యాధి సోకకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా దోమతెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రెండు పూరిళ్లు దగ్ధం



పూర్తిగా దగ్ధమైన పూరిల్లు

బిట్రగుంట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ఎస్‌వీపాలెం గిరిజన కాలనీలో మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తూ రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. కాలనీకి చెందిన కత్తి శూలమయ్య భార్య రోజులాగే కూలి పనికి వెళ్లి వచ్చి మధ్యాహ్నం వంట చేస్తుండగా నిప్పురవ్వలు ఎగిసిపడి పైకప్పుకు అంటుకున్నాయి. అవి పక్కనే ఉన్న కత్తి కోటయ్య ఇంటికి మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలో రెండు పూరిళ్లు పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు కావలి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేయడంతో వారు వచ్చి మంటలను అదు పులోకి తీసుకొచ్చారు. అప్పటికే మంటల్లో ఇళ్లల్లోని దుస్తులు, వస్తువులు పూర్తిగా కాలిపోవడంతో కట్టు బట్టలతో మిగిలిపోయారు. సంఘటనా స్థలానికి రెవెన్యూ సిబ్బంది చేరుకొని వివరాలు సేకరించారు. స్థానిక టీడీపీ నేత ఆదిశేషయ్య రెండు కుటుంబాలకు బియ్యం, పప్పుదినుసులు అందజేశారు.

ప్రతి శ్రామికుడికి పని కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

లింగసముద్రం, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో పని కావాలన్న ప్రతి శ్రామికుడికి పని కల్పించాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఏపీవో దయాసాగర్ అధ్యక్షతన టీఏలు, ఎఫ్ఏలు, కంప్యూటర్ ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని చెప్పారు. ప్రతి శనివారం డిమాండ్ పూర్తి చేసి, మస్టర్లు ఫీల్డ్ అసిస్టెంట్లు తీసుకెళ్లాలని తెలిపారు. సోమవారం పని ప్రదేశంలో మస్టరు కార్డులు తీసుకెళ్లి శ్రామికుల మస్టర్లను నమోదు చేయాలన్నారు. మండలంలో ఉద్యానవన పంటల సాగు వైపు రైతులు ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మామిడి, నిమ్మ పంటల సాగుకు ఈ పథకంలో అనేక రాయితీలు లభిస్తాయని పేర్కొన్నారు. అలాగే ఫారం పాండ్ల వద్ద కూడా మొక్కలను నాటించాలని తెలిపారు. రైతుల పొలాల్లో, ప్రభుత్వ భూముల్లో కూడా టేకు మొక్కలు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ విజయకుమార్, టీఏలు జి.వీరరాఘవులు, శ్రీకాంత్, జక్రయ్య, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైల్వే మూడోలైన్ అండర్ పాస్ ఏర్పాటు

- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



అండర్ పాస్ బాక్స్‌టైప్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలిటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణం ముసునూరు రాఘవేంద్ర కాలనీ వద్ద రైల్వే అండర్ పాస్ బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా మంగళవారం మూడవ లైన్‌కు బ్రిడ్జి (గడ్డర్) ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి బ్రిడ్జి ఏర్పాటు పనులను ఆసక్తిగా తిలకించి రైల్వే అధికారులతో సమీక్షించారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజల రాకపోకలకు సౌకర్యం కల్పించాలని సూచించారు. డీఈ (విజయవాడ) కెడీఎస్ కృష్ణన్, ఏడీఎన్ రాజేంద్రప్రసాద్, ఏడీఎస్‌టీ కార్తికేయకుమార్‌ల పర్యవేక్షణలో దాదాపు 70మంది సిబ్బందితో కలిసి రెండు భారీ క్రేన్‌లతో నూతనంగా నిర్మించిన మూడవ లైన్‌కు ఐరన్ బ్రిడ్జి (గడ్డర్) ఏర్పాటు చేశారు.

చెరువుల మరమ్మతులకు నిధుల మంజూరు

కందుకూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలోని పలు మైనర్ ఇరిగేషన్ చెరువులు, పంట కాలువల మరమ్మతులకు రూ.71 లక్షలు నిధులు మంజూరయ్యాయని ఇరిగేషన్ డీఈ హజరత్తయ్య తెలిపారు. మంగళవారం ఆయన తనని కలిసిన విలేకర్లతో మాట్లాడతూ కలవల్ల, పోలినేనిపాలెం, లింగపాలెం, లింగసముద్రం పాతచెరువు, చినపవని, ఎర్రారెడ్డిపాలెం, వీఆర్ కోట చెరువుల మరమ్మతులకు ఒక్కొక్క చెరువుకు రూ.4 లక్షల వంతున నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే వీర్‌కోట ఆనకట్ట సిస్టం పరిధిలోని మోపాడు, మాచవరం చెరువుల కింద ప్రధాన పంటకాలువల పూడిక తీత, చిన్నచిన్న నిర్మాణాల పనుల కోసం రూ.43 లక్షల మంజూరయ్యాయని వివరించారు. ఈ పనులన్నింటిని త్వరలో ప్రారంభించి రానున్న వర్షాల సీజన్ నాటికి పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని 20 మైనర్ ఇరిగేషన్ చెరువుల మరమ్మతులకు ఆర్ఆర్ఆర్ కింద ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఆయన తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



వలేటివారిపాలెం : చుండి సచివాలయంలో యోగా చేస్తున్న ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది




కలిగిరి ఎంపీడీవో కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

వలేటివారిపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో నరేంద్రదేవ్ తెలిపారు. మండలంలోని చుండి గ్రామ సచివాలయంలో జరుగుతున్న యోగా శిక్షణ తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. సచివాలయ సిబ్బందితో కలిసి యోగాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యంతో పాటు ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- కలిగిరి : యోగాతో ఫిట్‌నెస్, ఆరోగ్యం కలుగుతుందని ఎంపీడీవో ప్రత్యూష తెలిపారు. రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం యోగాసనాల పోటీలు నిర్వహించారు. ఇటీవల గ్రామాల్లో జరిగిన యోగా పోటీల్లో ప్రతిభ కనపరచిన వారికి మండలస్థాయి పోటీలు నిర్వహించారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో మేల్ ట్రైనర్ శ్రీకాంత్, ఫిమేల్ ట్రైనర్ లలితకుమారి, పీఈటీ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలుగా పగలే వెన్నెల!

- నిరంతరం వెలుగుతున్న వీధిలైట్లు
- పంచాయతీపై ఆర్థిక భారం
- పట్టించుకోని అధికారులు



వలేటివారిపాలెంలో పట్టపగలు వెలుగుతున్న వీధిలైటు

వలేటివారిపాలెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం 4వ వార్డులో పగలు రాత్రి అనే తేడా లేకుండా ఆరు నెలలుగా వీధిలైట్లు నిరంతరాయంగా వెలుగుతూనే ఉన్నాయి. దీంతో పంచాయతీపై అధిక ఆర్థిక భారం పడడంతో పాటు ఎల్ఈడీ లైట్లు త్వరితగతిన మరమ్మతులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. అయినప్పటికీ సంబంధిత పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. విద్యుత్‌ను వృథా చేయవద్దు విద్యుత్‌ను పొదుపు చేయాలని ప్రభుత్వం పదేపదే చెబుతున్నపట్టికీ పట్టించుకోవడం లేదు. గత ఆరు నెలల క్రితం వీధిలైట్లు మరమ్మతుల చేపట్టే క్రమంలో వీధిలైట్ల కనెక్షన్ నిరంతరం గృహాలకు సరఫరా జరిగే విద్యుత్ లైన్‌కు ఇవ్వడంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. దీంతో వీధిలైట్లు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి వీధిలైట్లు పగలు వెలగకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

వలేటివారిపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం టీఎఫ్‌టీ చినమాలకొండయ్య పరిశీలించారు. కూలీల మస్టరను తనిఖీ చేశారు. పనుల వద్ద తాగునీరు, టెంట్, మెడికల్ కిట్టు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. పనికి తగ్గ వేతనం లభిస్తుందా లేదా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించి కొలతల ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు కూలీ లభిస్తుందని ఆయన తెలిపారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ వీరమోసు అంజయ్య ఉన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న చినమాలకొండయ్య

వలంటీర్ల కథ కంచికేనా!?

(5వ పేజీ తరువాయి)

రూపాయలు. రాష్ట్ర వ్యాప్తంగా లెక్కిస్తే సుమారు 1500 కోట్లకు పైగా ఖజానాపై భారం పడుతుంది. వలంటీర్ల వ్యవస్థ లేకున్నా సంక్షేమ పథకాల అమలు సాఫీగా సాగుతున్నప్పుడు ఈ అదనపు భారం ఎందుకు!? అని ప్రభుత్వంలో ఉన్న ఆర్థిక నిపుణులు భావించే అవకాశం లేకపోలేదు. ఆ కారణంగానే అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా వలంటీర్ల వ్యవస్థ పునర్నియామకంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదనే ప్రచారం నడుస్తోంది.

జీజీహెచ్‌కు క్యాథ్‌ల్యాబ్!

(5వ పేజీ తరువాయి)

సంబంధించి ఓ వైద్య నిపుణురాలు నియమితులయ్యారు. క్యాథ్‌ల్యాబ్ వస్తే మరో ముగ్గురు గుండె వైద్యనిపుణులతో పాటు టెక్నీషియన్లను నియమించనున్నారు. ఆరు నెలల్లోపు ప్రత్యేక విభాగం నిర్మాణాలు జరిగే అవకాశం ఉంటుంది.

ఎంతో శుభపరిణామం



ఇది ఎంతో శుభపరిణామం. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్‌ను జీజీహెచ్‌కు కేటాయించటం సంతోషంగా ఉంది. ఇది అందుబాటులోకి వస్తే మరో ముగ్గురు గుండె వైద్య నిపుణుల నియామకం జరుగుతుంది. టెక్నీషియన్లు కూడా వస్తారు. గుండెకు సంబంధించి అన్ని రకాల వ్యాధులను గుర్తించే వీలు ఈ ఆధనిక క్యాథ్‌ల్యాబ్ ద్వారా గుర్తించే వీలు కలుగుతుంది.

- డాక్టర్ మంజుల, గుండె వైద్య నిపుణులు, జీజీహెచ్

ఏడాదిగా నిరుపయోగం!

కందుకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రైతుల బజారు సమీపంలో పాత లారీ స్టాండ్ ప్రాంగణంలో మున్సిపాలిటీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభమై 15 నెలలు గడిచినా నేటికీ వినియోగంలోకి రాక నిరుపయోగంగా మారింది. పాత లారీ స్టాండ్ ప్రాంగణంలో 18 గదులతో షాపింగ్ కాంప్లెక్స్‌ను గత ఏడాది మార్చిలో ప్రారంభించారు. అప్పటికే ఆ గదుల అద్దెల బహిరంగ వేలం పూర్తి చేయడంతోపాటు మున్సిపాల్ అధికారులు పాటదారుల నుంచి అడ్వాన్స్ డిపాజిట్లు కూడా వసూలు చేశారు. 18 గదుల్లో 4 గదులకు అప్పట్లో పాటదారులు రాకపోవడంతో ఇటీవల మున్సిపల్ అధికా రులు రెండుసార్లు అద్దెలకు బహిరంగ వేలం నిర్వహించినా ఫలితం లేదు. 15 నెలల క్రితం పాటలు పాడి అడ్వాన్స్‌లు చెల్లించిన వారికి నేటికీ రూములు స్వాధీనం చేయలేకపోవడం వల్లే ఈ నాలుగు రూములకు పాటలకు ఎవరు ముందుకు రావడం లేదనేది సమాచారం. షాపింగ్స్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేసి ప్రాంగణంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినప్పటికీ ఆ గదులకు విద్యుత్ సదుపాయం కల్పించడంలో విఫలమయ్యారు. విద్యుత్ సౌకర్యం కల్పించి గదులను పాటదారులకు స్వాధీనం చేస్తే అద్దెల రూపంలో ప్రతినెల మున్సిపాటికి రూ.1,50,000 ఆదాయం సమకూరుతుంది. ఈ స్థితిలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికే మున్సిపాలిటి రూ.20 లక్షలకు పైగా రాబడి కోల్పోయింది. ఇప్పటికైనా అధికారులు ఈ షాపింగ్ కాంప్లెక్స్‌ను తక్షణం పాటదారులకు స్వాధీనం చేసి మిగిలిన నాలుడు గదులకు వేలం పాట నిర్వహించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 4 జూన్ 2025

INTERVIEW

క్యాన్సర్‌ను జల్లెడ పడుతున్నాం!





క్యాన్సర్ అన్న పదమే ఒంట్లో వణుకు పుట్టిస్తుంది. వైద్యానికి లొంగని జబ్బుగా జనం నమ్మడమే ఇందుకు కారణం. క్యాన్సర్‌కి వైద్యం కూడా ఖరీదైనదే. అన్ని చోట్లా అందుబాటులో ఉండదు. అటువంటిది శ్రీవేంకటేశ్వరస్వామి దయానుగ్రహం వల్ల తిరుపతిలో టాటా సంస్థ ఆధ్వర్యంలో అత్యాధునిక క్యాన్సర్ ఆసుపత్రి మూడేళ్లుగా నడుస్తోంది. రాయలసీమ వాసులకు ఇది వరప్రసాదం. అత్యాధునిక సాంకేతికతగల ఈ ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థకు డైరెక్టర్ బాధ్యతలను తిరుపతివాసి డాక్టర్ పి.ప్రశాంత్ నిర్వహిస్తున్నారు. ఈ క్యాన్సర్ ఆసుపత్రిలో ఉన్న వైద్య సేవల గురించి ఆయనతో ఆంధ్రజ్యోతి సంభాషణ..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

6వ పేజీలో

● మహిళా ఉద్యోగిని లైంగికంగా వేధించిన

అటవీ అధికారి డిస్మిస్

● నేరం రుజువై జైలు శిక్ష పడటంతో ప్రభుత్వ నిర్ణయం

తిరుపతి, జూన్3 (ఆంధ్రజ్యోతి): తన కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి పట్ల అసభ్యంగా ప్రవర్తించి, లైంగికంగా వేధించిన అటవీశాఖ అధికారిని ప్రభుత్వం డిస్మిస్ చేసిన ఉదంతమిది. దొరవారిసత్రం మండలం నేలపట్టు బర్డ్ శాంక్చువరీలో ఫారెస్టు రేంజి అధికారిగా పనిచేస్తూ 2023లో కింది స్థాయి మహిళా ఉద్యోగి పట్ల అనుచితంగా వ్యవహరించిన బి.వరప్రసాద్ తాజాగా ఉద్యోగం నుంచీ ఉద్వాసనకు గురయ్యారు. ఆయనపై క్రిమినల్ కేసు నమోదు కాగా కోర్టు ఇటీవల జైలు శిక్ష విధించిన నేపథ్యంలో డిస్మిస్ వేటు వేసింది. దీనికి సంబంధించిన వివరాలిలా వున్నాయి. సూళ్ళూరుపేట వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్ డివిజన్ పరిధిలోని నేలపట్టు బర్డ్ శాంక్చువరీలో ఇదివరకు బి.వరప్రసాద్ ఫారెస్టు రేంజి అధికారిగా పనిచేశారు.ఆ సమయంలో 2023జూన్ 9న ఉదయం కార్యాలయంలో పనిచేసే ఫారెస్టు బీట్ అధికారి షేక్ అర్షత్తున్నీసాను లైంగికంగా వేధించారు. దీనిపై బాధితురాలు దొరవారిసత్రం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు. సూళ్ళూరుపేట జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో కేసు విచారణ జరిగింది. విచారణలో అటవీ రేంజి అధికారి బి.వరప్రసాద్ నేరం రుజువు కావడంతో కోర్టు మూడు నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 5వేలు జరిమానా విధిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 9న తీర్పు ప్రకటించింది. కోర్టు జైలు శిక్ష విధించిన నేపథ్యంలో ప్రస్తుతం ప్రకాశం జిల్లా మార్కాపురంలో అటవీ రేంజి అధికారిగా కొనసాగుతున్న వరప్రసాద్‌ను ఉద్యోగం నుంచీ డిస్మిస్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అసాధారణ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.


కేసు: బాపట్ల జిల్లా అద్దంకి నుంచి హైదరాబాదుకు డ్రగ్స్ సరఫరా.

నిందితులు: హైదరాబాదులో ఐదుగురి అరెస్టు. పోలీసుల అదుపులో ఏ1 నిందితుడు. పరారీలో మరొకరు.

ఎ1- డ్రగ్స్ సరఫరాదారు తిరుపతి రిజర్వు కానిస్టేబుల్ గుణశేఖర్.

ఎ2- తిరుపతి రూరల్ మండలం పేరూరు వైసీపీ ద్వితీయ శ్రేణి నేత ఉన్నం సురేంద్ర

హైదరాబాదు పోలీసులకు పట్టుబడిన ఆరుగురు డ్రగ్స్ ముఠాలో ఇద్దరు జిల్లా వారే. ఆ ఇద్దరూ కీలకమైన ఏ1, ఏ2 కావడం సంచలనం కలిగించింది.



కానిస్టేబుల్.. డ్రగ్స్ సరఫరాదారు

● హైదరాబాదులో పట్టుబడిన నిందితుల్లో ఇద్దరిది తిరుపతి జిల్లా
● ఈ మాఫియాలో కీలకం గుణశేఖర్ ● జిల్లాలోనూ దందాలెన్నో?
● బాధిత మహిళ ఫిర్యాదుతో రూరల్‌లో కేసు



కేవీబీపురం మండలం ఆరె గ్రామానికి చెందిన గుణశేఖర్ 2007లో ఏపీ ఎస్పీ కానిస్టేబుల్‌గా చేరాడు. 2009లో రిజర్వు విభాగానికి బదిలీ చేయించుకున్నాడు. ఇతడి భార్య రేణుక తిరుపతిలోని ప్రసూతి ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సు. తిరుపతి రూరల్ మండలం పేరూరులోని ఆర్ఎన్ఎర్ లేఅవుట్‌లో సొంతంగా ఇల్లున్నా.. నగరంలోనే ఉంటున్నారు. తొలి నుంచీ తిరుపతి రిజర్వు యూనిట్‌లో కానిస్టేబుల్. తరచూ విధులకు ఎగ్గొట్టేవాడని, పనితీరుపైనా విమర్శలున్నట్లు అధికారులు చెబుతున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా జరిగిన తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలో ఎంపీగా గెలుపొందిన గురుమూర్తి వద్ద 2022 జూన్ 13న గన్‌మ్యాన్‌గా చేరాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 25వ తేది వరకు కొనసాగాడు. ఈ రెండున్నరేళ్ల కాలంలో స్థానికంగా ఇతడి అవినీతి అక్రమాలకు అంతే లేకుండా పోయిందన్న విమర్శలున్నాయి. ప్రధానంగా అప్పట్లో భూదందాలు, సెటిల్‌మెంట్లు చేసేవాడని.. ఎవరైనా ఉద్యోగాల కోసం ఎంపీ వద్దకు వస్తే, వారితో మాట్లాడి ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి రూ.లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. టీటీడీలో దర్శనాల విషయంలోనూ, ఇతరత్రా పనులు చేసిపెడతానంటూ నగదు వసూలు చేసినట్లు తెలిసింది. తనతోపాటు పనిచేస్తున్న పలువురు కానిస్టేబుళ్ల వద్ద డబ్బు తీసుకుని ఎగ్గొట్టినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఎర్రచందనం అక్రమ రవాణా, గంజాయి దందాలోనూ ఇతడు భాగస్వామి అయినట్లు తెలిసింది. ఈ క్రమంలో కొందరు వైసీపీ నేతల సహకారం ఇతడికి ఉన్నట్లు ప్రచారంలో ఉంది. అదే సమయంలో తిరుపతి రూరల్ పేరూరు ప్రాంతానికి చెందిన వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకుడు ఉన్నం సురేంద్రతో పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ కలిసి పలు అక్రమ వ్యాపారాలు సాగించారు.

సెలవుల్లో డ్రగ్స్ సరఫరా!

ఈ ఏడాది ఫిబ్రవరి 25న ఎంపీ గన్‌మ్యాన్‌గా వెనక్కి వచ్చిన గుణశేఖర్ నుంచి వెన్నునొప్పి అంటూ అదే నెల 26 నుంచే మే 17వ తేది వరకు సిక్ లీవు పెట్టాడు. ఆ తర్వాత బావమరిది వెంకటేష్ పెళ్లి ఉందంటూ మే 31 నుంచి జూన్ 9 వరకు లీవులో వెళ్లాడు. ఇలా సెలవు పెట్టి సురేంద్ర, మరికొందరితో కలిసి తన అక్రమ వ్యాపారాన్ని డ్రగ్స్‌వైపు మళ్లించినట్లు ప్రచారం ఉంది. ఈ క్రమంలోనే కొకైన్, ఇతర డ్రగ్స్‌తో గుణశేఖర్ బ్యాచ్ హైదరాబాదు పోలీసులకు పట్టుబడింది.

డ్రగ్స్ దందాపై అత్యున్నత విచారణ జరపాలి

అంతరాష్ట్ర డ్రగ్స్ మాఫియా కేసులో అత్యున్నత స్థాయి విచారణ జరిపించాలంటూ కేంద్ర హోంశాఖ మంత్రికి లేఖ రాసినట్లు తిరుపతి ఎంపీ గురుమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి రిజర్వు విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గుణశేఖర్ డ్రగ్స్ వ్యవహారంలో పట్టుబడితే.. కొన్ని నెలలుగా తన వద్ద విధుల్లో లేని వ్యక్తికి సంబంధించిన వ్యవహారాన్ని తనకు అంటకట్టడం టీడీపీ దగాకోరు విధానానికి నిదర్శనమన్నారు. తన వద్ద గన్‌మ్యాన్‌గా పనిచేసిన గుణశేఖర్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 26న విధుల నుంచి వెనక్కి పంపించేశానని.. ఈ రికార్డులు ప్రభుత్వం వద్ద ఉన్నాయని గుర్తుచేశారు. తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు పోరాడతానన్నారు.

రిజర్వు కానిస్టేబుల్ గుణశేఖర్ నగదు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో ఎంపీ గురుమూర్తి తన వద్ద గన్‌మ్యాన్‌గా వద్దని చెప్పి వెనక్కు పంపారని అధికారులు చెబుతున్నారు.

స్థలం అమ్ముతామంటూ మోసం

● రిజర్వు కానిస్టేబుల్ గుణశేఖర్ దంపతులపై కేసు

స్థలం అమ్ముతామంటూ డబ్బు తీసుకుని మోసం చేశారన్న ఫిర్యాదుపై తిరుపతి రిజర్వు కానిస్టేబుల్ గుణశేఖర్, ఆయన భార్య రేణుకపై మంగళవారం కేసు నమోదైంది. 'ప్లాట్ విక్రయిస్తామని చెప్పి రిజర్వు కానిస్టేబుల్ గుణశేఖర్, ఆయన భార్య రేణుక కలసి గతేడాది మార్చిలో రూ.22 లక్షలు తీసుకున్నారు. ఇప్పటి వరకు స్థలం రిజిస్ట్రేషన్ చేసివ్వలేదు. చాలాసార్లు వారి ఇంటికెళ్లి అడిగినా సరైన సమాధానం రాలేదు. తీసుకున్న డబ్బులు ఇవ్వకపోగా, ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసివ్వక పోవడంతో మోసపోయామని గుర్తించాం' అంటూ తిరుపతి రూరల్ మండలం పేరూరు ఎన్టీఆర్ కాలనీకి చెందిన తుంగ లక్ష్మిరెడ్డెమ్మ సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ చిన్నగోవిందు ఏఆర్ కానిస్టేబుల్ గుణశేఖర్ దంపతులపై మంగళవారం కేసు నమోదు చేశారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

'తోతాపురి' @ రూ.12 వేలు

● మద్దతు ధర ప్రకటించిన కలెక్టర్



వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులు, మామిడి గుజ్జు పరిశ్రమ యాజమాన్యం ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చల అనంతరం తోతాపురి మామిడికి మద్దతు ధర టన్ను రూ.12వేలు నిర్ణయించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు జగన్‌మోహన్, మురళీమోహన్, మామిడి రైతు సంఘం నాయకులతో వర్చువల్ విధానంలో సమీక్షించి తోతాపురి మామిడికి మద్దతు ధర నిర్ణయించారు. మామిడి రైతులు, మామిడి పల్ప్ పరిశ్రమ యాజమాన్యం ఇద్దరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా తోతాపురికి రూ.12వేలు ధర నిర్ణయించినట్టు తెలిపారు. ఈ మేరకు మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యం, మామిడి మండీర్యాంపుల వారు కొనుగోలు చేయాలన్నారు. మామిడి మండీ ర్యాంపులలో కూడా రైతులకు గిట్టుబాటు ధర లేకుండా తక్కువ ధరకు కొంటున్నారన్నారు. దీని ప్రకారం వ్యాపారులు కొనుగోలు చేయాలన్నారు. తోతాపురి మామిడి రకానికి గిట్టుబాటు ధర కల్పించే విషయంలో రైతులకు తొలి ప్రాధాన్యం ఇచ్చినట్లు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. తమిళనాడు ప్రభుత్వంతో మామిడి గిట్టుబాటు ధరపై చర్చించినట్లు తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా మామిడి పరిశ్రమ చర్యలు తీసుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ కోరారు. అదే విధంగా రైతులు పల్ప్ ప్రాసెసింగ్‌కు సహకరించాలన్నారు. మామిడి గుజ్జు పరిశ్రమల యాజామాన్యాలు పరిశ్రమల నిర్వహణలో ఉన్న సమస్యలను తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్ల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో రెండు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



సాయం సంధ్యవేళ.. అటు పక్షులు గూడుకు, ఇటు సూరీడు అస్తమిస్తున్న ఈ దృశ్యం తిరుపతిలో మంగళవారం సాయంత్రం కనిపించింది.

శ్రీకాళహస్తి టౌన్ బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జి గడువు పొడిగింపు

తిరుపతి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి గడువును ప్రభుత్వం మరో ఆరు నెలల పాటు పొడిగించింది. ఈ బ్యాంకు పాలకవర్గానికి ఎన్నికలు జరగని నేపథ్యంలో ప్రభుత్వం గతంలో అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జిని నియమించింది. ఆ నియామకానికి సంబంధించి గడువు గత నెల 28వ తేదీతో ముగిసింది. దీంతో ప్రభుత్వం గత నెల 29వ తేదీ నుంచీ ఈ ఏడాది నవంబరు 28వ తేదీ వరకూ ఆరు నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర సహకార శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(క్రీడలు), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కడపలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 4, 5వ తరగతులకు సంబంధించి 2025-26 విద్యా సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో బాలాజీ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 19వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. బాలురకు 40, బాలికలకు 40 సీట్లు ఉన్నాయి. 4వ తరగతి అభ్యర్థులు 8నుంచి 10 సంవత్సరాల మధ్య ఉండాలి. 5వ తరగతి అభ్యర్థులు 9నుంచి 11సంవత్సరాలు మధ్య ఉండాలి. మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా జారీచేసిన జనన ధ్రువీకరణ పత్రం, ఒరిజినల్ డాక్యుమెంట్లు, వైద్యపరీక్షల్లో పాసైన ధ్రువీకరణ పత్రం ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. మరిన్ని వివరాల కోసం 9849014639నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.



దామినేడు వద్ద కార్ల షోరూములోని సీసీ ఫుటేజీ

● తిరుపతిలోని కార్ల షోరూములో రూ.7 లక్షల అపహరణ
● ఘటనా స్థలం పరిశీలించిన పోలీసు బృందాలు
● ఉత్తరాది ముఠాగా అనుమానం
● మూడు బృందాలు ఏర్పాటు చేసిన ఎస్పీ

కాళ్లు, చేతులు కట్టేసి దోపిడీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కాళ్లు, చేతులు కట్టేశారు. షోరూములోని రూ.7 లక్షలు దోపిడీ చేసుకెళ్లారు. ఈ ఘటన తిరుపతి నగరం రేణిగుంట రోడ్డులోని భార్గవి ఆటోమొబైల్స్ (మారుతీ షోరూం)లో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. క్రైం పోలీసుల కథనం మేరకు.. ముఖాలకు ముసుగు వేసుకున్న నలుగురు యువకులు మంగళవారం తెల్లవారుజామున షోరూమ్‌లోకి ప్రవేశించారు. లోపలున్న సేల్స్ ఎగ్జిక్యూటివ్ బాలాజీ చేతులు, కాళ్ళు కట్టేశారు. మేనేజర్ రూములోకి చొరబడ్డారు. అక్కడ రూ.7 లక్షలున్న చిన్న లాకర్ తీసుకెళ్లారు. ఆ తర్వాత కట్లు విడిపించుకుని బాలాజీ పోలీసులకు సమాచారం అందించారు. క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు, క్రైం డీఎస్పీ శ్యాంసుందర్, తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం, సీఐలు రాంకిషోర్, శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆ నలుగురు దొంగలకు 25 నుంచి 35 ఏళ్లు ఉంటాయి. వీరు హౌస్ బ్రేకింగ్‌లో ఆరితేరిన వారు. ఈ నలుగురు రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వచ్చి షోరూమ్ వెనుక వైపు నుంచి లోపలకు ప్రవేశించినట్లు భావిస్తున్నారు. హిందీ స్పష్టంగా మాట్లాడుతుండటంతో.. ఉత్తరాదికి చెందిన ముఠాగా అనుమానిస్తున్నారు. పరిసరాల్లో తనిఖీ చేసిన పోలీసులకు రైల్వే ట్రాక్‌పై పగులకొట్టి ఉన్న లాకర్ కనిపించగా దాన్ని సీజ్ చేశారు. షోరూములోని ముఖ్యప్రాంతాల్లో వేలి ముద్రల నిపుణలు వేలి ముద్రలు సేకరించారు. పాత నేరస్థుల వేలిముద్రలను పరిశీలించి.. ఈ ఘటన వెనుక వున్న దోపిడీ ముఠా ఎవరై ఉంటారనే కోణంలో దర్యాప్తు సాగించనున్నారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. అక్కడ వున్న సీసీ కెమెరాలు పరిశీలించి ఫుటేజీ సేకరించారు. తిరుపతి క్రైం సీఐ శివకుమార్ రెడ్డి కేసు నమోదు చేశారు. కాగా, దామినేడు వద్ద ఉన్న ఓ కారు షోరూములోనూ సోమవారం వేకువజామున చోరీకి యత్నించి సెక్యూరిటీని నిర్బంధించారు. ఈ దోపిడీ ఘటనల నేపథ్యంలో ఎస్పీ హర్షవర్ధనరాజు సీరియస్‌గా స్పందించారు. అనుమానం వున్న వారి కోసం మూడు పోలీసు బృందాలను నియమించారు. వీరు తిరుమల, తిరుపతి, చెన్నైతో పాటు విజయవాడ, హైదరాబాదుకు వెళ్లినట్లు తెలిసింది.

అధికారులతో సమీక్ష

జిల్లా అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, డీఎస్పీలు ప్రసాద్, భక్తవత్సలం, శ్యాంసుందర్‌తో ఎస్పీ హర్షవర్ధనరాజు తన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. దోపిడీ దొంగల ఆచూకీ గుర్తించి అరెస్టు చేయాలని క్రైం పోలీసులను ఆదేశించారు. గతంలో సీపీఆర్ విల్లాస్‌లో జరిగిన దొంగతనాలపైనా సమీక్ష చేసిన ఎస్పీ.. ఆ కేసు ఎంత వరకు వచ్చిందని ఆరా తీశారు. ఎస్పీ అడిగిన ప్రశ్నలకు కొందరు పోలీసు అధికారులు నోరు మెదపనట్లు తెలిసింది. స్మార్ట్ వర్కు చేసి ఫలితాలు రాబట్టాలని సూచించారు.



దోపిడీ జరిగిన మారుతీ షోరూమును పరిశీలిస్తున్న పోలీసులు

చిన్నశేషవాహనంపై గోవిందుడి చిద్విలాసం





తిరుపతిలోని గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు మంగళవారం ఉదయం ఉత్సవర్లు చిన్నశేష, రాత్రి హంస వాహనాలపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. వాహన సేవ ముందు కళాకారుల బృందాల కోలాటాలు, చెక్క భజనలు ఆకట్టుకున్నాయి.సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఊంజలసేవ నయనానందకరంగా సాగింది. ఈ కార్యక్రమంలో జియ్యంగార్లు, డిప్యూటీఈవో వి.ఆర్.శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ఏవీఎస్వో మోహన్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే' లో నటిస్తున్నా

● హీరో కార్తీక్ రాజు



'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే' అనే సినిమాలో నటిస్తున్నట్టు హీరో కార్తీక్ రాజు తెలిపారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాటాడుతూ, 'కౌసల్య కృష్ణమూర్తి' సినిమా విడుదలకు ముందు శ్రీవారిని దర్శించుకున్న తనకు మళ్లీ ఇన్నాళ్లకు దర్శనం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. మరో రెండు ప్రాజెక్టులనూ తాను చేస్తున్నట్టు వెల్లడించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి దర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.89 కోట్లు


సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,418

తలనీలాలు సమర్పించినవారు: 34,900

● విస్తరిస్తున్న టాటా ట్రస్ట్ సేవలు

● స్వీకార్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్‌తో ఆంధ్రజ్యోతి సంభాషణ

తిరుపతిలో క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం





శ్రీవారి పాదాల చెంత టాటా ట్రస్టు ఎంతో సమున్నత ఆశయంతో క్యాన్సర్ ఆస్పత్రిని నెలకొల్పింది. మూడేళ్లు పూర్తి చేసుకుంది. లాభాపేక్ష లేకుండా ఆస్పత్రి నడపాలన్నదే టాటా ట్రస్టు ఉద్దేశ్యం. ఆ దిశగా కృషి చేస్తున్నాం.

అలిపిరి నుంచి జూపార్క్‌కి వెళ్లే దారిలో పచ్చని వాతావరణంలో స్వీకార్ (శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్) ఉంది. టీటీడీ ఈ స్థలాన్ని టాటా సంస్థకు కేటాయించింది. 2018 ఆగస్టు 31న రతన్ టాటాతో కలసి సీఎం చంద్రబాబు నాయుడు ఈ సంస్థకు భూమిపూజ చేశారు. సుమారు రూ200 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో మూడేళ్లుగా క్యాన్సర్ ఆస్పత్రి నడుస్తోంది. ఈ ఆసుపత్రి అందిస్తున్న సేవల గురించి, ఇక్కడ ఉన్న ఆధునిక సాంకేతిక వైద్య పరికరాల గురించీ స్వీకార్ డైరెక్టర్ డాక్టర్ పి.ప్రశాంత్‌తో ఆంధ్రజ్యోతి జరిపిన సంభాషణలోని ముఖ్యాంశాలు ఇవి..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అత్యాధునిక పరికరంతో రేడియో థెరపీ

టాటా ట్రస్టుపై ఉన్న నమ్మకంతో రోగులు ఎక్కడెక్కడ నుంచో వెతుక్కుంటూ ఆస్పత్రి కి వస్తున్నారు. ప్రారంభంలో రోజుకు 30 మంది వచ్చేవారు. ఇప్పుడా సంఖ్య 350కి చేరుకుంది. ఆసియాలోనే అధునాతన లీనియర్ యాక్సిలరేటర్ టాటా ఆస్పత్రిలో ఉంది. ఏపీలో ఏ ఆస్పత్రిలో ఇటువంటిది లేదు. రూ. 20 కోట్లు విలువ చేసే ఈ పరికరం ద్వాఆరా రేడియో థెరపీ అందిస్తున్నారు. 2ఎంఎం ఉండే చిన్న చిన్న బ్రెయిన్ ట్యూమర్స్‌ను కూడా ఈ పరికరం ద్వారా కరిగించేవీలుందని వైద్య వర్గాలు చెబుతున్నాయి.



90 శాతం ఉచితమే : స్వీకార్‌లో 80 శాతం ఎన్టీఆర్ వైద్య సేవ, ఈహెచ్ఎస్ రోగులే ఉంటారు. మరో 10 శాతం మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారానూ, దాతల సహకారంతోనూ చికిత్స అందిస్తున్నాం. అనంతపురం, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలనుంచే కాకుండా తమిళనాడు, కర్నాటక నుంచి కూడా పేషెంట్లు వస్తున్నారు. నెలకు 150 సర్జరీలు, 1200 కీమో థెరపీలు, 80 రేడియో థెరపీలు చేస్తున్నాం. మా సంస్థలో పెట్‌సిటీ సౌకర్యం ఉంది. నోటిద్వారా వచ్చే క్యాన్సర్లు, రొమ్ము, ఓవరీ, కడుపు, ఊపిరితిత్తులు క్యాన్సర్లతో ఇక్కడికి ఎక్కువమంది వస్తున్నారు. ప్రస్తుతం బ్రెయిన్ ట్యూమర్స్‌కు చికిత్స, ట్రాన్స్‌ప్లాంటేషన్ స్వీకార్‌లో చేయడంలేదు. పిల్లలకు క్యాన్సర్ చికిత్స త్వరలో అందుబాటులోకి రానుంది. బ్లడ్ క్యాన్సర్ కేసులు కూడా ఇప్పుడు చూస్తున్నాం.

స్వీకార్ డైరెక్టర్ మన తిరుపతివాసి డాక్టర్ ప్రశాంత్

ప్రతిష్టాత్మకమైన స్వీకార్ క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ పి.ప్రశాంత్‌ది తిరుపతి. మూడో తరగతి వరకు తిరుపతిలో, ఆతర్వాత 10వరకు ఊటీ బోర్డింగ్ స్కూల్‌లో చదివారు. నెల్లూరు నారాయణలో ఇంటర్ అయ్యాక మంగళూరులోని కస్తూర్బ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చేశారు. వైజాగ్‌లోని ఆంధ్ర మెడికల్ కాలేజ్‌లో ఎంఎస్ పూర్తిచేశారు. ముంబైలోని టాటా మెమోరియల్ ఆస్పత్రిలో ఎంసీహెచ్ (సర్జికల్ ఆంకాలజీ) చేసిన డాక్టర్ ప్రశాంత్.. న్యూయార్క్‌లో రొబోటిక్ థొరాసిక్ సర్జరీపై శిక్షణ తీసుకున్నారు. పుదుచ్చేరిలోని జిప్‌మర్‌లో పదేళ్లపాటు సర్జికల్ అంకాలజిస్ట్‌గా పనిచేశారు. థొరాసిక్ సర్జరీ, హెడ్ అండ్ నెక్ ఆంకాలజీ, పెరిటోనియల్ సర్ఫేస్ మాలిగ్నన్సీల్లో ప్రత్యేక నిపుణుడుగా డాక్టర్ ప్రశాంత్‌కు పేరుంది. ఈయన తల్లి సులోచనమ్మ తిరుపతిలో వేలాది మందిని నర్సులుగా తయారు చేసిన విద్యావేత్త. సోదరుడు ప్రవీణ్ ఎడిఫై స్కూలు నడుపుతున్నారు. భార్య డాక్టర్ లక్ష్మీసంధ్య, స్వీకార్‌లోనే మెడికల్ అంకాలజీ విభాగంలో పనిచేస్తున్నారు.






అత్యాధునిక ఎమ్మార్ఐ పరికరం - మామోగ్రఫీ పరికరం

క్యాన్సర్ గుర్తించేందుకు క్యాంపులు

60 నుంచి 70 శాతం మంది కేన్సర్ 3 లేదా 4వ స్టేజ్‌లో వస్తున్నారు. ఇంకా ముందే గుర్తిస్తే చికిత్సకు వీలవుతుంది. అందుకే స్క్రీనింగ్ క్యాంప్స్ నిర్వహిస్తున్నాం. రోగుల వద్దకే వెళ్లి పరీక్ష చేస్తున్నాం. లక్షణాలుంటే ఆస్పత్రికి రెఫర్ చేస్తాం. ఇప్పటివరకు 805 క్యాంపులు నిర్వహించాం. వీటి ద్వారా 50వేల మంది రోగులను పరీక్షించగా 468మందిలో కేన్సర్ అనుమానిత లక్షణాలు గుర్తించాం. వారిలో 42 మందికి నిర్ధారించి, 40మందికి చికిత్స అందించాం.

లుకేమియాకీ చికిత్స

అధునాతన పద్ధతులతో కీహోల్ లంగ్ ఆపరేషన్లు, హైప్యాక్, బైప్యాక్ ప్రొసీజర్లు, ఐసీయూ, క్రిటికల్ కేర్, రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీలు, కాలు నుంచి ఎముక తీసి ముఖానికి పెట్టడం వంటివి స్వీకార్‌లో చేస్తున్నాం. ఈ ఏడాది నుంచి ఇమ్యునోథెరపీ కూడా ప్రారంభించాం. బ్రెయిన్‌లో ఎక్కడ క్యాన్సర్ గడ్డ ఉందో అక్కడే రేడియేషన్ (ఫోకస్డ్ రేడియేషన్)ఇచ్చే విధానం ఉంది. నాలుగు నెలలుగా లుకేమియాకు వైద్యం ప్రారంభించాం. అక్యూట్ క్యాన్సర్ వాళ్లకు అవసరమైన డయాలసిస్ యూనిట్‌ను కూడా ప్రారంభించాం. మరీ ముఖ్యంగా పాలేటివ్ కేర్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చాం. చివరి దశలో ఉన్న రోగులకు పాలేటివ్ కేర్‌లో అంకితభావంతో పనిచేసే సిబ్బంది మా సంస్థలో ఉన్నారు.



"వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స ఇచ్చేదానికన్నా ముందస్తు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవడంతో చాలావరకు కేన్సర్‌ను నిరోధించవచ్చు. పింక్ బస్సు మెడికల్ మొబైల్ యూనిట్ ద్వారా ఆ పనిచేస్తున్నాం.ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నాం. ఇందువల్ల మహిళల్లో బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ వ్యాధిని గుర్తించి తొలిదశలోనే చికిత్స అందించగలుగుతున్నాం."

రూ.4,500లుకే క్యాన్సర్ వ్యాక్సిన్

స్వీకార్‌లో సర్వైకల్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. 9 నుంచి 14 ఏళ్ల వరకు పిల్లలకు ఈ వ్యాక్సిన్ ఇవ్వడానికి సరైన వయసు. మగవాళ్లు కూడా ఈవ్యాక్సిన్ వేసుకోవచ్చు. వారికి అనస్, నోటి క్యాన్సర్లు నిరోధించవచ్చు. పెళ్లికి ముందు 30 ఏళ్ల దాకా కూడా వేసుకోవచ్చు అమ్మాయిలు 3 డోసులు, అబ్బాయిలు 2 డోసులు వేసుకోవాల్సి ఉంటుంది. ఒక డోసు ఖరీదు రూ4.5వేలు. కార్పొరేట్ ఆస్పత్రుల్లోకన్నా తక్కువ. ప్రజల్లో అవగాహన పెరగడం వలన సర్వైకల్ క్యాన్సర్ కేసులు గత పదేళ్లతో పోలిస్తే చాలా తగ్గుతున్నాయి.

చెరువులో దిగి గల్లంతైన పాడి రైతు



చెరువు వద్ద పరిశీలిస్తున్న అధికారులు

పెళ్లకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిరసనమాల గ్రామానికి చెందిన దొడ్డగా శ్రీనివాసులు (55) పశువుల కోసం చెరువులో దిగి గల్లంతైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన దొడ్డగా శ్రీనివాసులు భార్య మాధవితో కలసి పశువులను మేపేందుకు చెరువుకట్టపైకి వెళ్లారు. సాయంత్రం పశువులను ఇంటికి తీసుకొస్తుండగా ఆవుదూడ చెరువులోకి దిగింది. దూడను గట్టుమీదకు తీసుకొచ్చేందుకు శ్రీనివాసులు చెరువులోకి దిగాడు. ఆవుదూడ కాస్త లోతులోకి వెళ్లడంతో శ్రీనివాసులు ముందుకెళ్లి భార్య మాధవి కళ్లెదుటే నీటమునిగి గల్లంతయ్యాడు. చెరువు నీటిలో మునిగిపోయిన భర్త బయటకు రాకపోడంతో మాధవి కేకలు వేస్తూ గ్రామానికి చేరుకుని బంధువులకు తెలిపింది. సమాచారం అందుకున్న గ్రామస్తులు ఎస్ఐ నాగరాజు, వీఆర్వో భూధనం రమేష్, పంచాయతీ కార్యదర్శి సమ్మన శ్రీహరితో పాటు అగ్నిమాపక సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని శ్రీనివాసులు మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం కనిపించకపోవడంతో బుధవారం ఉదయం గాలింపు చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

యోగాంధ్రలో భాగస్వాములు కండి : కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 3(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కోటలో బుధవారం ఉదయం జరిగే యోగాంధ్రలో భాగస్వాములు కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం పిలుపునిచ్చారు. యోగా కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజాప్రతినిదులు, ప్రజలు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు 2వేల మందికి పైగా పాల్గొంటారన్నారు. అందుకు సంబంధించిన మౌలిక వసతులను కల్పించినట్లు తెలిపారు.

65 ఏళ్లు దాటిన వారికి ఇంటి వద్దకే రేషన్

65 సంవత్సరాలు నిండిన వారికి ఇంటి వద్దకే రేషన్ సరుకులను ఇవ్వనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. 65 సంవత్సరాలు దాటిన వారు రేషన్ దుకాణానికి రావాల్సిన అవసరం లేదని డీలర్లే ఇంటి వద్దకు తెచ్చిస్తారన్నారు. దీనిపై ఎలాంటి అపోహలు వద్దన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలకు పరిష్కారం చూపాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే అర్జీలకు సంతృప్తికర పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలు రీఓపెన్‌కు తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

మీ ఇళ్లను కూడా ఇలాగే ఉంచుకుంటారా...?

● ఆర్టీసీ పారిశుధ్య కార్మికులను మందలించిన జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి



కోట ఆర్టీసీ బస్టాండ్‌లో పారిశుధ్య కార్మికులను ప్రశ్నిస్తున్న జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

కోట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వందలాది మంది ప్రయాణీకులు వచ్చే ఆర్టీసీ బస్టాండ్ ఇలానేనా ఉండాల్సింది... ఇక్కడ ఎటుచూసినా చెత్త కనిపిస్తుంది... ఇలా ఉంటే ప్రయాణీకులకు రోగాలు రావా... ఇక్కడ కార్మికులు ఎవరో పిలిపించండంటూ ఆ సంస్థ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కోట ఆర్టీసీ బస్టాండ్‌లో బీజేపీ నాయకులు, ఆర్టీసీ అధికారులతో కలిసి ఆయన గంట పాటు తనిఖీలు చేశారు. బస్టాండ్‌లోకి రాగానే ప్రాంగణం అంతా చెత్తాచెదారంతో నిండి ఉండటం, మరోపక్క నక్కలోళ్లు ఇష్టారాజ్యంగా వ్యర్థాలు పడేయటాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. వెంటనే వాకాడు ఆర్టీసీ డీఎం చిన్నపెంచలయ్యను పిలిపించి ఆర్టీసీ ప్రాంగణంలో నక్కలోళ్లను బయటకుపంపి శుభ్రం చేయించాలని కోరారు. గూడూరు డీఎస్పీ గీతా కుమారికి ఫోన్‌చేసి నక్కలోళ్లను వెంటనే బయటకుపంపాలని కోరారు. మహిళల మరుగుదొడ్లకు గోడలపైన రేకులు లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి మీ ఇళ్లల్లో ఆడవాళ్లను ఇలాగే చూసుకుంటారా అని అక్కడ మరుగుదొడ్లను శుభ్రంచేసే కార్మికులను ప్రశ్నించారు. ఇలాగే కొనసాగితే కాంట్రాక్టర్ అనుమతులు రద్దుచేస్తామని హెచ్చరించారు. బస్టాండ్ ప్రాంగణంలో ఎలాంటి వ్యర్థాలు వేయకూడదని, ఆదర్శంగా ఉండాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్టీసీ డిపోల్లో 3వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కొత్తగా 950 బస్సులు కొనుగోలు చేసి, వాకాడు డిపోకు 14 బస్సులు ఇస్తామన్నారు. అన్ని డిపోలలో ఎలక్ట్రిక్ బస్సులు నడపనున్నట్లు సురేష్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు, నాయకులు గిరిధర్‌రెడ్డి, డాక్టర్ రమేష్‌బాబు, అంబరీషా, ఆర్టీసీ కార్మికులు ఉన్నారు.

వెన్నుపోటు దినం ఎందుకు?

● వైసీపీ నేతలకు చంద్రగిరి ఎమ్మెల్యే సూటి ప్రశ్న ● సైకో పాలన విముక్తికి ఏడాది పూర్తయిందన్న నాని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి(జీవకోన), జూన్ 3(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ప్రజలకు జూన్ 4వ తేది పండుగ రోజు. కానీ వైసీపీ వారు మాత్రం వెన్నుపోటు దినమని చెబుతున్నారు. వెన్నుపోటు దినం ఎందుకు? ఐదేళ్ల వైసీపీ పాలనలో హౌసింగ్ పేరుతో తూతుమంత్రంగా స్థలాలు చూపి ఇల్లు కట్టనందుకా? ఒకేసారి పింఛను పెంచకుండా మోసం చేసినందుకా? ప్రజలకు మీరిచ్చిన హామీలను నెరవేర్చనందుకా? తల్లిని, చెల్లిని బయటకు పంపినందుకా? మద్యనిషేధం, మెగా డీఎస్సీ చేయకుండా చేసినందుకా? బీసీ,ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ నిధులు మళ్లించినందుకా? బాబాయిని గొడ్డలి వేటుతో నరికినందుకా? ఎందుకు వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నారు' అని వైసీపీని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రశ్నించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి కబంధహస్తాల నుంచి.. సైకో పాలన నుంచి నేడు ప్రజలకు విముక్తి కలిగిన రోజు జూన్ నాలుగో తేది అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. దీనికి ఏడాది పూర్తయినట్లు తెలిపారు. ప్రజలు 11 సీట్లతో తీర్పు ఇచ్చినా వైసీ పీనాయకుల్లో మార్పు రాలేదన్నారు. వెన్నుపోటు దినం పేరుతో ఘర్షణ వాతావరణం సృష్టించాలన్నదే వైసీపీ ప్లాన్ అన్నారు.సూపర్‌సిక్స్ పథకాలను దశలవారీగా అమలు చేస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయలో జరిగిన దాడి, తుడాలో అవకతవకలపై మీడియా వారు ప్రశ్నించగా, చట్టం తన పని తాను చేసుకుపోతుందని సమాధానం చెప్పారు. యోగాడేను బుధవారం ఉదయం చంద్రగిరి కోట వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

'గొడ్డలి పోటు' దినం నిర్వహించండి

తిరుపతి అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ వెన్నుపోటు కాకుండా గొడ్డలిపోటు దినోత్సవంగా నిర్వహిస్తే బాగుండేదని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ప్రజలను మోసం చేయడమే కాకుండా రాష్ట్రాన్ని లూటీ చేసిన వైసీపీ ఎన్డీఏ కూటమి పాలనను విమర్శించే అర్హత లేదన్నారు. వైసీపీ అరాచక పాలనకు ముగింపు పలికి.. ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరి ఏడాదైన సందర్భంగా బుధవారం పండుగలా వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 9గంటలకు తిరుపతి నగరం ఎస్టీవీ నగర్‌లో ముగ్గులపోటీ, సాయంత్రం ఎన్జీవో కాలనీలోని తన కార్యాలయం వద్ద దీపాలు వెలిగించడంతో పాటు టపాకాయలు కాల్చనున్నట్లు చెప్పారు.

వెన్నుపోట్లతా జగన్ కుంటుంబంలోనే..

శ్రీకాళహస్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వెన్నుపోట్ల చరిత్ర చూసుకుంటే జగన్ ఇంట్లోనే ఉన్నాయని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ మంగళవారం అన్నారు. మంగంపేట మైన్స్ హత్యల నుంచి పీవీ నరసింహరావు మీద చెప్పులు విసిరే దాక, ఆస్తుల కోసం చెల్లెలిని వదిలేసిన విధానం, వివేకానందరెడ్డి హత్య... ఇలా వెన్నుపోట్లతోనే నిండి ఉందన్నారు.

పది మంది టీడీపీ నేతలపై కేసు కొట్టివేత

తిరుపతి, జూన్3(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన పది మంది టీడీపీ నేతలపై నమోదైన ఎన్నికల ఉల్లంఘన కేసును అదనపు జూనియర్ సివిల్ జడ్జి మంగళవారం కొట్టివేశారు. 2019 సాధారణ ఎన్నికల్లో ప్రచారానికి అధికారుల వద్ద ముందస్తు అనుమతి తీసుకోలేదని తిరుపతి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఏపీజీబీసీ చైర్మన్ మన్నూరు సుగుణమ్మ, టీటీడీ పాలక మండలి సభ్యురాలు పనబాక లక్ష్మి, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, తిరుపతి నగర డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, రాష్ట్ర నాయకులు సూరా సుధాకర్ రెడ్డి, దంపూరి భాస్కర్ యాదవ్, బి.జి. కృష్ణ యాదవ్, డాక్టర్ సుధారాణి, పుష్పావతి, డాక్టర్ ఆశాలతపై కేసు నమోదైంది. సుదీర్ఘ విచారణ అనంతరం వీరిని నిర్దోషులుగా నిర్ధారించి కేసు కొట్టివేశారు. ఈ కేసును టీడీపీ లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ దినకర్, సత్యశ్రీవాసన్ వాదించారు.



ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్



ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కొండేపాటి గంగాప్రసాద్

గూడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పుట్టిన రోజు కార్యక్రమాలను మంగళవారం గూడూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపం నుంచి టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యేకు క్రేన్ సాయంతో గజమాలలను వేసి బ్యాండుమేళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఎమ్మెల్యే కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల అండదండలు, ఆశీస్సులతో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ సహకారంతో తాను ఈ స్థాయికి ఎదిగానన్నారు. తనపై ఆదరణ చూపుతున్న ప్రజలకు రుణపడిఉంటానన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, వివిధ శాఖల అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు, నోటు పుస్తకాలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కొండేపాటి గంగాప్రసాద్ మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. వివిధ ప్రాంతాల్లో నాయకులు అన్నదాన, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి, సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తానంకి నానాజీ, శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కరరెడ్డి, పులిమి శ్రీనివాసులు, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, ఆరకట్ల మస్తాన్ నాయుడు, లీలావతి, పూడిపర్తి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్, జనార్దన్‌రెడ్డి, చిట్టేటి కీరవాణి, వాటంబేడు శివకుమార్, పేటేటి చంద్రనీల్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు చరిత్ర జగన్‌దే

● నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల



మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నేతలు

నాయుడుపేట టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు చరిత్ర జగన్‌దేనని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం విమర్శించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వెన్నుపోటు దారుడు జగన్ వెన్నుపోటు కార్యక్రమాన్ని నిర్వహించడం సిగ్గుచేటని, ప్రజలు ఈ కార్యక్రమాన్ని తిరస్కరిస్తారని అన్నారు. వెన్నుపోటుకు, గొడ్డలివేటుకు పేటెంట్ జగన్‌మోహన్‌రెడ్డి అని అభివర్ణించారు. కంటికి రెప్పలా పెంచిన నీ బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డికి వెన్నుపోటు పొడిచావని ఆరోపించారు. దీనికి భయపడి నీ తల్లి, చెల్లి సైతం నీవద్దకు రావడం లేదన్నారు. ప్రజా వ్యతిరేక పనులకు పాల్పడుతున్న వైసీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతో ప్రజలు అధిక సీట్లలో గెలిపించారని చెప్పారు. ఆ నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని అన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు వంటి పథకాలను ఆగస్టు లోపల అమలుపరిచేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఫీ, విజయకుమార్ నాయుడు, మురళీకృష్ణారెడ్డి, నంచి కృష్ణయ్య, పొట్లపూడి రాజేష్, చెంచయ్య, అవధానం సుధీర్, గంగాప్రసాద్, రాజేంద్ర, సుబ్బారావు, పెనల కిషోర్‌బాబు, మస్తాన్, నారాయణ తదితరులు ఉన్నారు.

వైసీపీ పాలనలో ఆర్టీసీ అస్తవ్యస్తం


● జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి



వాకాడు ఆర్టీసీ డిపోను పరిశీలిస్తున్న సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

వాకాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థ వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారడంతోపాటు అభివృద్ధికి నోచుకోలేదని ఆ సంస్థ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి విమర్శించారు. వాకాడు ఆర్టీసీ డిపోను మంగళవారం బీజేపీ నాయకులతో కలసి ఆయన తనిఖీ చేశారు. డిపో ఆవరణం అంతా పరిశీలించి పారిశుధ్య పనులను సరిగ్గా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. రోడ్లు సరిగ్గా వేయకపోవడంతో బస్సులు మరమ్మతులకు గురయ్యాయన్నారు. వాకాడు ఆర్టీసీ డిపోకు నూతనంగా 14 ఎక్స్‌ప్రెస్‌లను తీసుకువచ్చామన్నారు. కోట నుంచి తిరుపతి, తిరుమలకు నిరంతరాయంగా 5 బస్సులను ఏర్పాటు చేశామన్నారు. వాకాడు బస్టాండ్ గతుకులమయంగా ఉందని, మరమ్మతులు చేయిస్తామన్నారు. ఉదయం 4 గంటలకు త్వరలో పొద్దుటూరుకు బస్సు రూట్ మ్యాప్ వేసేలా చూస్తామన్నారు. డిపోలో పరిశుభ్రత పెంచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పెంచలయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు పామాంజి కృష్ణయ్య, వాకాటి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సునీల్‌కు సైకత శుభాకాంక్షలు



ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సైకతశిల్పాన్ని రూపొందిస్తున్న సనత్‌కుమార్

చిల్లకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఏఏరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో మంగళవారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని ఏరూరు గ్రామానికి చెందిన సైకతశిల్పి మంచాల సనత్‌కుమార్ ఎమ్మెల్యే సైకత శిల్పాన్ని రూపొందించి శుభాకాంక్షలు తెలిపారు. సనత్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే 30 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ సైకత శిల్పాన్ని తమ్మినపట్నం గ్రామానికి చెందిన కోట సతీష్‌యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించినట్లు చెప్పారు.

రేపటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

గూడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీకంటి రామమోహన్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఈవో రవికృష్ణ, సభ్యులు గోపాల్, శ్రీరంగ, ఆలయ అర్చకులు వాచస్పతి తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ హుండీ చోరీ యత్నం

వెంకటగిరిటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలేరమ్మ ఆలయ హుండీ సోమవారం అర్ధరాత్రి 2గంటలకు చోరీ చేసేందుకు దుండగులు యత్నించారు. రాత్రి సమయంలో ఈ హుండీ మార్కెట్ వీధిలో ఉండడాన్ని చూసిన స్థానికులు దానిని యథావిధిగా పోలేరమ్మ ఆలయంలో ఏర్పాటు చేశారు. హుండీలో ఎటువంటి అపహరణ జరగకపోవడంతో ఆలయ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సుబ్బారావు తెలిపారు.

థియేటర్లలో తనిఖీలు

కోట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని అరుణ, ఆర్‌ఆర్‌సి థియేటర్లలో మంగళవారం తహసీల్దారు జయజయరావు తనిఖీలు నిర్వహించారు. ఆర్‌ఐ ప్రసాద్, వీఆర్వోలు శ్రీనివాసులు, రమణయ్య థియేటర్లలో ప్రేక్షకులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ స్థలాలను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు థియేటర్ యజమానులను హెచ్చరించారు.

పీఎంఏజేవై ద్వారా ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు

● వైసీపీ హయాంలో ఆగిన పనులకు కూటమి సర్కార్ చొరవ

సూళ్లూరుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధజలం అందించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన కింద 2021లో సూళ్లూరుపేట నియోజకవర్గంలోని సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లోని 10 గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేసింది. వైసీపీ పాలనలో సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో అప్పట్లో గ్రామ సర్పంచులు ఈ పథకాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రాలేదు. దీంతో నిధులు మంజూరైన ఒక్కచోట కూడా ఆర్వో ప్లాంటు ఏర్పాటుకాలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ఈ పథకంలో కదలిక వచ్చింది. ఈ నేపథ్యంలో సూళ్లూరుపేట మండలం ఇలుపూరు, దొరవారిసత్రం మండలం పూలతోట, కొత్తపల్లి రెండు చోట్ల ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. సర్పంచులు ముందుకురావడంతో ఈ ప్రాంతాల్లో శరవేగంగా పనులు జరిగి ప్రజలకు శుద్ధజలం అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగు నీరందించాలనే ఉద్దేశంతో ఒక్కొక్క ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తోంది. గ్రామంలో ప్లాంట్‌తో పాటు ఇతర సామగ్రి కొనుగోలు, విద్యుత్ తదితరాల కోసం రూ.5 లక్షలు, భవన వసతి కోసం రూ.3 లక్షలు మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వ చొరవతో 2024-25 ఆర్థిక సంవత్సరం చివరి కల్లా మంజూరైన చోట ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు సర్పంచులు ముందుకు వస్తున్నారు. ఈ మేరకు అధికారులు కూడా సన్నాహాలుచేస్తున్నారు. వైసీపీ హయాంలో ఆగిన పనులను కూటమి సర్కార్ చొరవతీసుకుని పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవడం విశేషం.



నీటిని శుద్ధిచేసే పరికరాలు, ట్యాంకు



ఇలుపూరులో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్

క్రీడల ప్రోత్సాహానికి ప్రత్యేకచర్యలు

● శాప్ చైర్మన్ రవి నాయుడు

గూడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు శాప్ చైర్మన్ రవి నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక ఏఏరెడ్డి ప్రభుత్వస్టేడియంలో నూతనంగా నిర్మిస్తున్న గ్యాలరీ, ఓపెన్ జిమ్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌తో కలసి ప్రారంభోత్సవం చేశారు. రవి నాయుడు మాట్లాడుతూ గ్రామీణస్థాయి క్రీడాకారుల నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తుందన్నారు. గూడూరులోని ఏఏరెడ్డి ప్రభుత్వ స్టేడియాన్ని అభివృద్ధి పరిచేందుకు ఎమ్మెల్యే పాశిం తన సొంత నిధులను వెచ్చించి సహకారం అందిస్తున్నారన్నారు. క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా జిమ్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ స్టేడియంలోకి మురుగునీరు వస్తుండంతో వాకర్స్, క్రీడాకారులు అవస్థలు పడేవారన్నారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా నూతన ప్రహరీగోడ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించి, పనులు ప్రారంభించినట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే కప్ క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తానంకి నానాజీ, శీలం కిరణ్‌కుమార్, వేగూరు రాజేంద్రప్రసాద్, గంటా మధుకృష్ణ, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, పులిమి శ్రీనివాసులు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, మట్టం శ్రావణి, నిమ్మకాయల రవి, సర్వోత్తమరెడ్డి, మునిగిరీష్ పాల్గొన్నారు.



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న రవి నాయుడు, సునీల్‌కుమార్ తదితరులు

స్కిల్‌హబ్ ఏర్పాటు

గూడూరు అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు మంగళవారం తెలిపారు. నిరుద్యోగ యువతను గుర్తించి ఆయా ప్రాంతాల్లో గల పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందజేసి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఈ స్కిల్‌హబ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ స్కిల్‌హబ్‌లో అసిస్టెంట్ టెక్నీషియన్ స్ట్రీట్‌లైట్ ఇన్‌స్టాలేషన్, ఎలక్ట్రికోహెవికల్ అసెంబ్లీ టెక్నీషియన్ కోర్సులలో ఉచిత శిక్షణ అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8639835953 నంబరును సంప్రదించాలని తెలిపారు.

'వెన్నుపోటు దినం'ను జయప్రదం చేయండి

వెంకటగిరిటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం రాపూరు కేంద్రంగా వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెంకటగిరి సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, శాతరాసి బాలయ్య, వహిదా, కళ్యాణి, పులి ప్రసాద్‌రెడ్డి, రాధ తదితరులు పాల్గొన్నారు.


నాణ్యమైన సరుకులు అందించాలి



చిక్కీని పరిశీలిస్తున్న పీడీ వసంతాబాయి

వెంకటగిరిటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైనా సరుకులను లబ్ధిదారులకు అందించాలని పీడీ వసంతబాయి అన్నారు. మంగళవారం స్థానిక మొక్కలపాడు, పాళెంకోట, బొప్పాపురం, చెవిరెడ్డిపల్లి, బుసపాళెంలోని అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ సెంటరులో పిల్లల హాజరు, లబ్ధిదారులు ఫేస్‌క్యాప్చర్, స్టాక్ నాణ్యత తప్పకుండా ఉండాలన్నారు. కేంద్రాలకు స్టాక్ నాణ్యతగా వస్తేనే తీసుకోవాలన్నారు. అనంతరం కిశోర వికాసం పిల్లలకు బాల్యవివాహలు, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. వెంకటగిరి మండలంలో టీవీఎస్ ట్రస్టు చేసిన అభివృద్ధిని ఆమె ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో షంషాద్ బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

బలిజ చేయూత ఫౌండేషన్ ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నగదును అందజేస్తున్న బలిజ చేయూత ఫౌండేషన్ సభ్యులు

నాయుడుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిచ్చిరెడ్డి తోపులో ఓ కుటుంబానికి నాయుడుపేట బలిజ చేయూత ఫౌండేషన్ ఆర్థిక సాయమందించింది. పిచ్చిరెడ్డితోపులో నివాసం ఉంటున్న తిరుమల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి మంగళవారం రూ.10వేల నగదును బలిజ చేయూత ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో పగడాల శివప్రదీప్, పృధ్వీ, హరికృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం... రాములోరి కల్యాణం



సీతారాముల కల్యాణం జరుపుతున్న వేదపండితులు

కోట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని అల్లారెడ్డి శ్యామసుందరపురంలో వెలసి ఉన్న అభయాంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం సీతారాముల కల్యాణం జరిపారు. సీతారామ ధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు వెంకటరామిరెడ్డి-హైమావతమ్మ దంపతుల ఆర్థిక సౌజన్యంతో అర్చక సలహామండలి సభ్యులు దివి అనంతాచారి, నరేష్‌శర్మల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని కన్నులపండువగా జరిపారు. భక్తులు తలంబ్రాల కోసం పోటీపడ్డారు. భక్తులకు స్వామివారి కంకణాలను అందజేశారు. శరవణ, రాధా, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు చీరలు, దుప్పట్ల పంపిణీ

చిట్టమూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షులు గణపర్తి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో చిట్టమూరు టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలోని 200 కుటుంబాలకు చెందిన నిరుపేద గిరిజనులకు దుప్పట్లు, చీరలు, బియ్యం, వివిధ రకాల నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీడీవో మనోహర్‌గౌడ్, ఎస్‌ఐ చిన్నబలరామయ్య, టీడీపీ నాయకులు జనార్దనరెడ్డి, హరికృష్ణారెడ్డి, సునీల్‌రెడ్డి, చిన్నారావు, రాజేష్‌రెడ్డి, చెంచురామయ్య, ధనంజయ్య నాయుడు, కస్తూరయ్య, రషీద్, బషీర్, సురేష్, పవన్, శ్రావణ్, అంకయ్య తదితరులు ఉన్నారు.

కోటలో...



షాదీమంజిల్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని షాదీమంజిల్‌లో మంగళవారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు జరుపుకున్నారు. తిరుపతి జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, రైతు విభాగం కార్యదర్శి నెల్లూరు మోహన్‌రెడ్డి, వెంకన్నపాళెం సర్పంచ్ కొకర్ల మధుయాదవ్‌ల ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిల్లకూరు దశరథరామిరెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు సురేష్, షంషుద్దీన్, తిరుమలశెట్టి కోటేశ్వరరావు, చెంగల్‌రావు, చల్లా సురేష్, వాకా విజయభాస్కర్‌రెడ్డి, కోటేశ్వరప్రసాద్, మర్రి పోలయ్య, చాపల శీనయ్య తదితరులు ఉన్నారు.


వాకాడులో...

వాకాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వాకాడులో 8 అడుగుల భారీ బెలూన్‌ను పంత్రాంగం అరుణ్ ఏర్పాటు చేసి ఎగురవేయడంతో టీడీపీ నాయకులు కేరింతలు కొట్టారు. టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో దోసకాయల కృష్ణమూర్తి, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, కల్లూరు హరీష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్ల రాజకీయ జీవితంలో

పేదలకు ఎంతో సేవ చేశా

● ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్



గూడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లోకి వచ్చి 30 ఏళ్లు పూర్తి అయ్యాయని, మూడు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో ఎంతో మంది పేదలకు సేవ చేశాననే సంతృప్తి కలుగుతోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. 1985లో ఏబీవీపీ విద్యార్థి సంఘ నాయకుడిగా, 1987లో ఎస్ఎఫ్ఐ పట్టణాధ్యక్షుడిగా, 1989లో ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల చైర్మన్‌గా, 1995లో టీడీపీ నుంచి మున్సిపల్ చైర్మన్‌గా, 2000లో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగా పని చేశానని చెప్పారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యానని, 2014, 2024 జరిగిన ఎన్నికల్లో గూడూరు ఎమ్మెల్యేగా గెలుపొందానన్నారు. స్థానికుడిని కావడంతో ప్రతి ఒక్కరితో పార్టీలకతీతంగా సఖ్యతగా ఉంటూ, పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు. గూడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు సహకరిస్తున్న సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తనను ఆదరిస్తున్న నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ రుణపడిఉంటానని ఎమ్మెల్యే తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన చిత్తూరు మునేంద్ర

తడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. దొరవారిసత్రం మండలం ఉచ్చూరు గ్రామానికి చెందిన చిత్తూరు మునేంద్ర (25) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. పనిమీద మంగళవారం ఉదయం బైక్‌పై తమిళనాడు ఆరంబాకంకు వెళ్లాడు. అక్కడ పనిచూసుకొని తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలో తడ బోడిలింగాలపాడు మలుపువద్ద అదే దారిలో తిరుపతి నుంచి చెన్నైకు వెళ్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా మలుపుతిరిగింది. దీంతో వెనుక వస్తున్న మునేంద్ర బైక్ కంట్రోల్ చేసుకోలేక బస్సు వెనుక టైరువద్ద ఢీకొట్టుకొని టైరు కిందకు వెళ్లిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని 108లో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంతో చెన్నై-నెల్లూరు జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న తడ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. తమిళనాడు ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు వెన్నుపోటు పొడవడం వల్లే వైసీపీకి 11 సీట్లు



వెంకటగిరిలో మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

వెంకటగిరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) గత వైసీపీ ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడవటం వల్లే ఆ పార్టీ 11 సీట్లకే పరిమితమైందని, ఆ సంగతి మరిచి ఈ నెల 4న ప్రజా ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ వెన్నుపోటు దినంగా నిరసన తెలుపుతామని చెప్పడం సిగ్గుచేటని టీడీపీ సీనియర్ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, గంగాధర్, బీరం రాజేశ్వరరావు, పప్పు చంద్రమౌళిరెడ్డి, అవ్వారు సత్యనారాయణ విమర్శించారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ పేదల పింఛన్లు పెంచడానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టిందని అన్నారు. రాష్ట్రాభివృద్ధిని విధ్వంసక దుస్థితిలోకి తీసుకెళ్లిన ఘనత వైసీపీదేనన్నారు. అధికారం చేపట్టగానే ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మంకు ఆనంద్, బోలిగల వెంకటసుబ్బయ్య, కాపా శ్రీనివాసులు నాయుడు, చంద్రారెడ్డి, చలపతి తదితరులు ఉన్నారు.


భక్తిశ్రద్ధలతో గంధ మహోత్సవం



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

గూడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక దర్గావీధిలోని హజరత్ సయ్యద్ హసీం ఉస్సేనీ రహంతుల్లా ఔలియా దర్గాలో సోమవారం రాత్రి గంధ మహోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంధాన్ని ఊరేగింపుగా దర్గావద్దకు తీసుకువచ్చి మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హసీమ్ ఉస్సేనిబాబా సమాధికి గంధ లేపనం జరిపారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో రియాజ్ అహ్మద్, మగ్దూం, సిరాజ్‌అహ్మద్, ఇలియాజ్, యస్దానీ, దిల్దార్, ఖమర్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గూడూరు అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాల బారిన పడకుండా ఉంటామని చెన్నూరు పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోతి అన్నారు. మంగళవారం మండలంలోని చెన్నూరులో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల వలన మలేరియా వ్యాధి సంభవిస్తుందన్నారు. పరిసరాలలో మురుగునీరు నిల్వచేరకుండా, అపరిశుభ్ర వాతావరణం లేకుండా చర్యలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లీలాకృష్ణ, నాగేశ్వరరెడ్డి, మస్తానయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఎరువులను వాడాలి

వెంకటగిరిటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రైతులు ఎరువులను సమతులంగా వాడాలని కృషి విజ్ఞాన శాస్త్రవేత్త శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వల్లివేడులో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి ఎరువులపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానంతో పోటీ పడేలా అవగాహన పెంపొందించుకోవాలన్నారు. వ్యవసాయంలో మొబైల్ యాప్ ద్వారా సూచనలు అందించబడుతాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.